RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 05 నవంబర్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:135

ఎన్టీఆర్ గార్డెన్స్‌లో ఘనంగా సదర్ సమ్మేళనం

ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి,
ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్,
టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్





హైద్రాబాద్ నవంబర్ 4: హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్స్‌లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సదర్ సమ్మేళనంలో యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయాలు, సంస్కృతి, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హనుమంతరావు,మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యాదవ సంఘాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సదర్ సమ్మేళనం కేవలం యాదవ సోదరుల పండుగే కాదని, అది తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహిం చిన సదర్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవుల చిరకాల కోరికను నెరవేరుస్తూ.. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వేడుకల నిర్వహణ కోసం రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించే ఆలోచన చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శిం చారు. హైదరాబాద్‌లోని నేటి గోల్కొండ కోట ఒకనాటి 'గొల్లం కొండ' అని, నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని కొనియాడారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని, అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే పదవి ఇచ్చామని గుర్తుచేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఈశ్వరమ్మ యాదవ్ ను నియమించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణలో విజయవంతంగా నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాబోయే రోజుల్లో యాదవులకు న్యాయ మైన వాటా దక్కేలా చూస్తామని రేవంత్‌రెడ్డి హామీఇచ్చారు. యాదగిరిగుట్టలో గోసంర క్షణకు ప్రత్యేకఏర్పాట్లుచేస్తున్నామని తెలి పారు. మూసీపునరుజ్జీవం, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి ప్రాజెక్టులకు యాదవ సోద రులుసహకరించా లని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు

రాష్ట్రవ్యాప్తంగా 2.21 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి
పండుగ రోజున లబ్ధిదారుల ఇళ్లకు ప్రజాప్రతినిధులు, అధికారులు
మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రులు
నాలుగు కార్పొరేషన్లలో జీ+5 ఇందిరమ్మ టవర్లు
దీపావళిలోగా నోటిఫికేషన్ జారీ: మంత్రి పొంగులేటి


మిగతా 2 లో

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం నవంబరు 4: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ దీపావళిని రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లలోనే జరుపుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. గృహప్రవేశాలు పూర్తయిన ప్రతి ఇంటికి ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని సూచించారు.మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కేంద్రంలో బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమక్షంలోనే సమగ్ర భూ సర్వే
వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేయాలని లక్ష్యం
క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కరిస్తాం
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం నవంబర్ 4: రాష్ట్రంలో ప్రధానంగా రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీసర్వే చేపడుతున్నామని, రైతుల భూ సమస్యల పరిష్కారానికి వారి సమక్షంలోనే రీసర్వే జరగాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వే జరిగే గ్రామాల్లో ప్రతిరోజు తహశీల్దార్లు పర్యటించాలని , ఆర్డీవో, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడమేగాక కనీసం వారానికోరోజు రీసర్వే జరిగే గ్రామాలకు వెళ్లాలని స్పష్టం చేశారు.

వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సమగ్రంగా సర్వే చేసి, భూ యజమానులకు పూర్తి భద్రతతో కూడిన వివాదరహిత భూములను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో వారి భూమికి సంబంధించిన సమగ్ర, భద్రతతో కూడిన రికార్డులు, పాస్‌బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు.

మిగతా 2 లో

బేతుపల్లి చెరువు ఘటనపై మంత్రి పొంగులేటి నిరంతర పర్యవేక్షణ

కలెక్టర్, పోలీసు కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా
సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగొద్దని అధికారులకు ఆదేశం
గురువారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ప్రవహిస్తున్న నేపథ్యంలో సహాయక చర్యలకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పరిస్థితిపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మురసు తుపాను ప్రభావంతో బేతుపల్లి చెరువు వద్ద చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం బోటు తిరగబడిన విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో పాటు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు తక్షణమే అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. రంగంలోకి దిగిన సహాయక బృందాలు గల్లంతైన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమీప ప్రాంతంలో సురక్షితంగా ఉన్నట్లు గుర్తించాయి. వారిని మరో గంటలోగా ఒడ్డుకు చేర్చేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు మంత్రికి వివరించారు.

సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేరుకునే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన రక్షణ పరికరాలు, బోట్లు అందుబాటులో ఉంచడంతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సహాయక చర్యల పురోగతిని జిల్లా కలెక్టర్‌తో ఎప్పటికప్పుడు మాట్లాడి సమీక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు గురువారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లనున్నట్లు వెల్లడించారు.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం: మంత్రి పొన్నం

ప్రయాణికురాలి దాడిలో గాయపడిన మహిళా కండక్టర్ ప్రవళిక మృతి
మృతురాలి తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పొన్నం హామీ
ఉస్మానియా మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి నివాళి అర్పించిన మంత్రి



ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కలిపి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

మిగతా 2 లో

ప్రజాబలం

05 నవంబర్ 2026 గురువారం

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

బుధవారం నాడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి భూ సర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి. శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో కలిసి మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్లో సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చట్టంలో నిర్దేశించిన విధంగా తొలుత రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా వేగవంతంగా చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. గతంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించామని, ఈసారి నేరుగా జిల్లాలకు వచ్చి స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో సమావేశమై సమస్యలను సమీక్షిస్తున్నట్లు చెప్పారు.

మండల స్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపిక చేసి, ఆయా మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కోరుతున్న అంశాలు, అధికారులకు ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ స్థాయి అనుమతులు, మార్గదర్శకాలపై ఉన్నది ఉన్నట్లుగా అధికారులు వివరించాలని సూచించారు. సమస్యలను దాచిపెట్టకుండా స్పష్టంగా తెలియజేస్తే అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరిస్తూ బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని మంత్రి తెలిపారు. ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టించే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై అదే స్థాయిలో తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా కేవలం



భూముల కొలతలకే పరిమితం కాకుండా, సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు.

రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూములకు సంబంధించిన సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలు వంటి అంశాలను కూడా సమగ్ర సర్వే ద్వారా గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు సమష్టిగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. 22ఎ కు సంబంధించి ఇప్పటివరకు ఇచ్చిన జీవో లు, మెమో లతో కవర్ కానీ అంశాలు ఏమైనా ఉంటే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్ రెడ్డి, అరికేపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,21,500 ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్లు నిర్మాణంలోని వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తొలి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' పేరుతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, హౌసింగ్ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. పేదల ఇంట్లో వెలిగే ప్రతి దీపం ప్రజాప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు.

నాలుగు నగరాలకు ఇందిరమ్మ టవర్లు

హైదరాబాద్ తరహాలో నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్లలోనూ జీ+5 విధానంలో ఇందిరమ్మ టవర్లను నిర్మించనున్నట్లు పొంగులేటి ప్రకటించారు. ఈ నిర్మాణాలకు సంబంధించి దీపావళిలోగా నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్లలో వచ్చే ఏడాది బోనాల వేడుకలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.40 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. నగరాలు, పట్టణాలు, గ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలు, తండాల్లోనూ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. పేదలకు భద్రత, భరోసాతో కూడిన సొంతింటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం: మంత్రి పొన్నం

ప్రయాణికురాలి దాడిలో గాయపడిన మహిళా కండక్టర్ ప్రవళిక మృతి

మృతురాలి తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పొన్నం హామీ

ఉస్మానియా మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి నివాళి అర్పించిన మంత్రి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద అక్టోబర్ 25న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. టికెట్ డబ్బుల చిల్లర విషయమై ప్రయాణికురాలు మౌనికతో జరిగిన గొడవలో... ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి కిందకు తోసేయడంతో ఆమె వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న రాత్రి ఆమె కన్నుమూశారు. ఈ ఘటనపై ఇప్పటికే నిందితురాలైన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

టీజీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి:

రాహుల్‌కు నిర్మల సవాల్

మోదీ బహిరంగ చర్చకు రావాలన్న గాంధీ ఘాటుగా

స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని స్పీకర్ వ్యాఖ్య

సమాధానాలు వినకుండా సభ నుంచి వాకౌట్ చేయడంపై విమర్శలు

ఆధారాలతో చర్చకు వచ్చి, ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని సూచన

బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా? అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వరుస పోస్టులు చేశారు. "రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళ్లు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. "సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు. ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా



తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" కార్యక్రమాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. అది "మాక్ పార్లమెంట్" కన్నా "పార్లమెంటును అపహాస్యం చేయడం"లా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడేవారు ముందుగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని హితవు పలికారు. "'డరో మత్' (భయపడొద్దు) అని మీరు అంటుంటారు కదా.

అలాంటప్పుడు వాస్తవాలతో, ఆధారాలతో సభకు రండి, విమర్శలను ఎదుర్కోండి, సమాధానాలు వినడానికి కూర్చోండి" అని రాహుల్ గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు.

భారత్ లో అంత పేదరికం తగ్గిందా...

దశాబ్ద కాలంలో ఆర్థిక, ఆర్థికేతర అంశాల్లో పేదరికాన్ని తగ్గించడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గిస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటని ఆ నివేదిక పేర్కొంది.

'భారత్‌లో పేదరికం, సమానత్వం' పేరుతో ప్రపంచ బ్యాంక్ ఈ నివేదిక విడుదల చేసింది.దారిద్ర్య రేఖకు దిగువన అంటే రోజుకు 4.2డాలర్ల (సుమారు రూ. 399) కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా శాతం 2011 నుంచి 2023 మధ్య 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది" అని నివేదికలో ప్రపంచబ్యాంక్ తెలిపింది.ఈ కాలంలో 49.6 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. అదే సమయంలో తీవ్ర పేదరికంలో అంటే రోజుకు 3 డాలర్ల (సుమారు రూ. 285)కంటే తక్కువ ఆదాయంతో నివసిస్తున్న జనాభా 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గింది" అని వెల్లడించింది.భారత్‌లో పేదరికం తగ్గడం కొనసాగుతుందని, అయితే ఈ తగ్గుదల వేగం కొంత నెమ్మదించవచ్చని అంచనావేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు పేర్కొంది.రోజుకు రూ. 399 ఆదాయాన్నిదారిద్ర్య రేఖగా గుర్తిస్తే 2026లో 14.2 శాతంగా ఉన్నపేదరికం రేటు 2028 నాటికి 12.1 శాతానికి తగ్గవచ్చని అంచనావేసింది."ఆర్థికేతర ప్రమాణాల ఆధారంగా పేదరికాన్ని అంచనావేయడానికి ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (ఓపీహెచ్ఐ) రూపొందించిన మల్టిడైమన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) ఆధారంగా అంచనా వేస్తారు.2005-06లో పేదరికం రేటు 53.8 శాతంగా ఉండగా అది 2019-21 నాటికి 16.4 శాతానికి తగ్గింది. 2022-23లో ఈ రేటు 15.5 శాతంగా ఉందని ప్రపంచ బ్యాంకు బహుముఖ పేదరిక సూచీ తెలిపింది.భారత్‌లో పేదరికం తగ్గుతున్నప్పటికీ ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సమస్య మాత్రం అలాగే ఉంది."నిజానికి ప్రజలెంత ఖర్చుచేస్తున్నారనేదాని ఆధారంగా అసమానతలను లెక్కిస్తే అవి చాలా తక్కువగా కనిపిస్తాయి. ఆదాయాలను పోల్చిచూస్తే అసమానత చాలా ఎక్కువగా ఉంటుంది" అని ఇండియాటుడే నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా చెప్పారు."భారత్‌లో ప్రజల ఆదాయాలకు సంబంధించి అసలు సర్వేలే నిర్వహించడం లేదు. మన దేశంలో ఆర్థిక అసమానతలు చాలా తీవ్రమైన సమస్య. అది మరింత తీవ్రమైంది. మనం దీనిని నిర్లక్ష్యం చేయకూడదు" అని ఆయన అన్నారు.ప్రపంచబ్యాంక్ నివేదికలోని అంశాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వాగతించారు. నివేదిక గణాంకాల్లోని సానుకూల అంశాలను సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌లో ఆమె ప్రస్తావించారు."ప్రజల వినియోగం గణనీయంగా పెరగడం, ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం, ఆహార సబ్సిడీతో పాటు సామాజిక సంక్షేమ పథకాల విస్తరణ వంటివి పేదరికం తగ్గడానికి ప్రధాన కారణాలని ప్రపంచ బ్యాంకు గుర్తించింది" అని నిర్మలా సీతారామన్ అన్నారు."ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం అమలుచేస్తున్న విధానపరమైన ప్రయత్నాలు స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో అందరికీ అభివృద్ధి ఫలాలు అందించే సమ్మిళిత వృద్ధికి, ప్రజలకు మరిన్ని ఆర్థిక అవకాశాలు కల్పించడానికి బలమైన పునాది ఏర్పడుతోంది" అని ఆమె విశ్లేషించారు.పేదరికం తగ్గినప్పటికీ కొన్ని వర్గాల కుటుంబాల్లో ఇప్పుడది ఎక్కువగా కనిపిస్తోందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది.విద్యాస్థాయి తక్కువగా ఉన్నవాళ్లు, ఆస్తులు తక్కువగా ఉన్నవాళ్లు, స్థిరమైన ఉపాధి పొందే అవకాశాలు పరిమితంగా ఉన్నవాళ్లు, కుటుంబపోషణ భారం ఎక్కువగా ఉన్నవాళ్ల కుటుంబాల్లో పేదరికం ఎక్కువగా ఉందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది.

కూలీల వేతనాల మధ్య అసమానతలు ఇప్పటికీ చాలా ఎక్కువగా ఉన్నాయని నివేదిక తెలిపింది. 2023లో అత్యధిక వేతనాలు పొందుతున్న పది శాతం కార్మికుల సగటు వేతనం, అతి తక్కువ వేతనాలు పొందుతున్న 10 శాతం కార్మికుల సగటు వేతనం కంటే దాదాపు 13 రెట్లు ఎక్కువగా ఉంది" అని నివేదిక పేర్కొంది."కొన్ని ప్రత్యేక భౌగోళిక ప్రాంతాల్లో పేదరికం ఎక్కువగా ఉందని కూడా నివేదిక పేర్కొంది.చాలా రాష్ట్రాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పటికీ దేశంలోని మొత్తం పేద జనాభాలో సుమారు 57 శాతం జనాభా ఉత్తర ప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు వరుసగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తోంది" అని నివేదిక పేర్కొంది.2017 నుంచి 2023 మధ్యకాలంలో ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నవాళ్ల సంఖ్య సుమారు 13.4 కోట్లు పెరిగిందని కూడా నివేదిక పేర్కొంది. పని చేసే వయసులో ఉన్న జనాభా పెరుగుదలతో పోలిస్తే ఉపాధి పొందుతున్న వారి సంఖ్య దాదాపు రెట్టింపు పెరిగింది. ఈ ఉపాధి పెరుగుదలలో ఎక్కువ భాగం గ్రామీణప్రాంతాల్లో మహిళలు జీతం వచ్చే పనుల్లో చేరడం వల్లే సాధ్యమైంది. దీనివల్ల కుటుంబంలో సంపాదించే సభ్యుల సంఖ్య పెరిగింది.అయితే యువతలో నిరుద్యోగం పెరిగిన విషయాన్ని కూడా ప్రపంచ బ్యాంక్ ప్రత్యేకంగా ప్రస్తావించింది.2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం మధ్య యువతలో నిరుద్యోగ రేటు 14.6 శాతం నుంచి 15.9 శాతానికి పెరిగింది. ఈ ప్రభావం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువతులపై ఎక్కువగా పడిందని నివేదిక తెలిపింది.అంతేకాకుండా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్నతర్వాత లెక్కించే వాస్తవ వేతనాల్లో పెద్దగా మార్పులేదని నివేదిక పేర్కొంది. అదే సమయంలో ఉపాధి పెరిగినప్పటికీ ఎక్కువ ఉత్పాదకత లేని పనుల్లోనే ఈ పెరుగుదల ప్రధానంగా కనిపించిందని తెలిపింది.

జహీరాబాద్ ప్రాంత ప్రజా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన కోదండరాం

రైతులను ఆదుకోవాలని, చక్కెర పరిశ్రమను త్వరగా ప్రారంభించాలని వినతి

జహీరాబాద్, నవంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి: జహీరాబాద్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ



జన సమితి పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొగడంపల్లి ఆశప్పలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ప్రాంతంలో వర్షాధారంగా సాగు చేసే కంది, పెసర, మినుము, చిరుధాన్యాల రైతులు ఈ ఏడాది పంట నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో చెరుకు రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని వివరించారు. చెరుకు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చక్కెర పరిశ్రమను త్వరితగతిన ప్రారంభించాలని, రైతులకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ ప్రాజెక్టు కారణంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు.

మచ్చలేని మేధావి నాయకుడు తెలంగాణకు గర్వకారణం

మంత్రి దామోదర రాజనర్సింహ



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 04 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా : కాంగ్రెస్‌లో ఆరు దశాబ్దాల సిలారపు కుటుంబ రాజకీయ ప్రస్థానం,ప్రజాసేవకు అంకితమైన వారసత్వం ,అపార రాజకీయఅనుభవం, అసాధారణ మేధస్సు ,ప్రతిఅంశంపైలోతైన విషయపరిజ్ఞానం,తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ గొంతుకను బలంగా వినిపించిన ధీశాలి,ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన సామాజిక న్యాయ ప్రదాత,ఎస్సీ వర్గీకరణ అమలులోకీలక పాత్ర పోషించిన అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఆయన ఆంగ్ల ప్రసంగం వింటే, ప్రతిపదానికిడిక్షనరీవెతకాల్సిందే,రాజకీయాల్లో అనుభవం ఆలోచనల్లోపరిణతి,మాటల్లో పాండిత్యం ,ప్రజాసేవలో నిబద్ధత,పదవికివన్నెతెచ్చేవ్యక్తిత్వం,ప్రజా జీవితానికిఆదర్శప్రాయమైన నాయకత్వం,దామోదర రాజనర్సింహా, అంటే ఒక నాయకుడు మాత్రమే కాదు, అనుభవం, విజ్ఞానం, సామాజిక న్యాయం, కలగలిసిన మహనీయుడు...

మెహిదీపట్నం హోటల్లో అగ్నిప్రమాదం



హైదరాబాద్ మెహిదీపట్నం కింగ్స్ రెస్టారెంట్లో రాత్రి 11:40 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. నూడుల్స్ తయారుచేసే ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసారు. లంగర్ హౌస్, అంబర్‌పేట నుంచి ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లు చేరుకున్నాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడంతో ఘటన జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు.

విద్యార్థుల జీవితాల్లో నిత్య స్ఫూర్తి ఉపాధ్యాయులే.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి..
పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలి.
రాష్ట్ర పంచాయతీరాజ్, మంత్రి సీతక్క





ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్. 04 కలెక్టరేట్బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పాఠశాల విద్యాశాఖ- ఆధ్వర్యంలో పదో తరగతి వార్షిక పరీక్షలు--2027 విద్యార్థుల సంసిద్ధతపై ప్రధానోపాధ్యాయులు,
మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ములుగు జిల్లా ఉత్తమ స్థానాలు సాధించిందని తెలిపారు. గిరిజన ప్రాంతం విద్యలో వెనుకబడి ఉంటుందనే భావనను మార్చి, జిల్లా విద్యార్థుల ప్రతిభను రాష్ట్రానికి చాటిచెప్పారని ప్రశంసించారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తీసుకున్న ప్రత్యేక చర్యలు మెరుగైన ఫలితాలకు దోహదపడ్డాయని అన్నారు. ఉపాధ్యాయుల కృషిని ఎప్పటికీ మర్చిపోమని, వారి కష్టసుఖాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.
ఒక ఉపాధ్యాయుడి జీవితంలో వేలాది మంది విద్యార్థులు ఉంటారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు వెచ్చించే సమయం, శ్రమ వారి విజయాల్లో ప్రతిబింబిస్తాయని అన్నారు. విద్యార్థులకు ఇష్టమైన ఉపాధ్యాయులుగా మెలుగుతూ, ఆయా సబ్జెక్టులపై ఆసక్తిని పెంచాలని సూచించారు. మారుమూల ప్రాంతాల నుంచి ఎదిగినవారు తమలాంటి మరెన్నో తరాలు ముందుకు వచ్చేలా కృషి చేయాలని, సొంత ప్రాంతానికి సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
పోటీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు తగిన ప్రేరణ అందించాలని సూచించారు. సిలబస్‌ను పూర్తి చేసి, పునశ్చరణ, సాధన పరీక్షల ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించాలని తెలిపారు. ఏయే అంశాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో గుర్తించి, ప్రత్యేక సమయం కేటాయించి బోధించాలని సూచించారు. వసతిగృహాల్లోని విద్యార్థులపైనా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న తరుణంలో చదువుతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలని కోరారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల విద్యార్థుల్లో బిడియాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని నింపాలని సూచించారు.
ములుగు జిల్లా విద్యతోపాటు రహదారులు, పర్యాటకం, మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో సమృద్ధిగా ఉన్న అటవీ సంపద, సహజ వనరులు, సాంస్కృతిక వైభవాన్ని అభివృద్ధికి వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తమ పరిజ్ఞానం, అనుభవం, పరిశీలనల ఆధారంగా విద్యాభివృద్ధితోపాటు జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ములుగు జిల్లా విద్యా ఫలితాల్లో వరుస విజయాలు సాధించడం ఉపాధ్యాయుల అంకితభావం, కృషికి నిదర్శనమని అభినందించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఒకే మార్గదర్శకాలు అందినా, వాటిని సమర్థంగా అమలు చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలిపిన ఘనత ఉపాధ్యాయులదేనని అన్నారు. వరుస విజయాలు కష్టానికి ప్రతిఫలమేనని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహం, ఆత్మవిశ్వాసంతో పనిచేసి మరోసారి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులను కోరారు.
ఉపాధ్యాయులు అందించే చిన్న ప్రోత్సాహం కూడా విద్యార్థి జీవితంలో గొప్ప మార్పుకు దారితీస్తుందని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం చదువులో వెనుకబడిన విద్యార్థులు భవిష్యత్తులో విశేషంగా రాణించవచ్చని, వారిలో నమ్మకాన్ని పెంచి ముందుకు నడిపించాలని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులు అందించే సహాయాన్ని విద్యార్థులు జీవితాంతం గుర్తుంచుకుంటారని, తాను
ఈ స్థాయికి చేరుకోవడంలోనూ తన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉందని గుర్తుచేశారు. ప్రతి విద్యార్థిని ఆదరణతో ప్రోత్సహిస్తూ, ముఖ్యంగా చదువులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మరింత అండగా నిలవాలని కోరారు.
అంతకుముందు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ, డిసెంబర్ నాటికి సిలబస్‌ను పూర్తి చేసి, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని మంత్రికి వివరించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని బట్టి ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బోధన అందిస్తామని తెలిపారు. కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు, జిల్లాను మరోసారి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపి రికార్డు సృష్టించేలా కృషి చేస్తున్నామని వివరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్ధన్, జీసీడీఓ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించాలి.
రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క





ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంత్రి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో నేరుగా మాట్లాడి, వారి చదువు, శిక్షణా విధానం, వసతి సౌకర్యాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభ్యర్థులు లక్ష్యంపై దృష్టి సారించి, క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించి, తదుపరి దశల్లోనూ ప్రతిభ కనబరిచి పోలీస్ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. అభ్యర్థుల విజయానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.అనంతరం మంత్రి శిక్షణార్థులతో కలిసి భోజనం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఎస్పీ రవీందర్, ఆర్ఐ, సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

బేతుపల్లి చెరువు ఘటనపై మంత్రి తుమ్మల నిరంతర పర్యవేక్షణ ..

సమస్య పరిష్కారం అయ్యేవరకు అధికారులు అక్కడే ఉండాలని మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు ..



సత్తుపల్లి మండల పరిధిలోని బేతుపల్లి పెద్ద చెరువు వద్ద ఈరోజు రాత్రి జరిగిన సంఘటనపై మంత్రి తుమ్మల నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. బేతుపల్లి చెరువులో 8 మంది మత్స్యకారులు చిక్కుకున్న నేపథ్యంలో, వారిని రక్షించే ప్రయత్నంలో ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది పడవ బోల్తా పడిన సంఘటనలో, ఆ సిబ్బంది గల్లంత అయ్యారు అని వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ సంఘటనపై మంత్రి తుమ్మల నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ని ఈ సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు అక్కడే ఉండాలని మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వపరంగా ఏ సహాయ సహకారాలు కావాలన్నా వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి ఫోన్ నెంబర్ల కోసం అత్యాధునిక టెక్నాలజీ వాడాలని మంత్రి తుమ్మల కోరారు. సత్తుపల్లిలో ప్రస్తుత పరిస్థితిపై మంత్రి తుమ్మల స్థానిక శాసనసభ్యులతో పాటు ఉన్నత అధికారులను ఎప్పటికప్పుడు పరిస్థితిని సమన్వయం చేసుకుంటున్నారు.

ధరల మోతతో సామాన్యుడి వెత

(హెచ్. ప్రతాప్)

సామాన్యుడి సంపాదనకు పరిమితులున్నాయి. కానీ నిత్యావసర వస్తువుల ధరలకు మాత్రం హద్దులు కనిపించడం లేదు. తెలంగాణలో బియ్యం, పప్పులు, వంటనూనెలు, ఇతర ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో మధ్యతరగతి, అల్పాదాయ కుటుంబాల జీవనం భారంగా మారుతోంది. ఒకప్పుడు నెలవారీ ఖర్చుల్లో కొంత పొదుపునకు అవకాశం ఉండగా, ప్రస్తుతం నిత్యావసరాలకే అధికంగా వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ 9న వెలువడిన మార్కెట్ నివేదికల ప్రకారం తెలంగాణలో సన్నబియ్యం ధర కిలో రూ.70 నుంచి రూ.80--82కు పెరిగింది. గతంలో సుమారు రూ.1,800కు లభించిన 25 కిలోల బియ్యం బస్తా ధర రూ.2,150కు చేరింది. సెప్టెంబర్ నుంచి అక్టోబర్ మధ్య కందిపప్పు ధర కిలో రూ.126 నుంచి రూ.143కు, మినపప్పు రూ.120 నుంచి రూ.128కు, పెసరపప్పు రూ.106 నుంచి రూ.112కు పెరిగాయి. గుండుమిర్చి ధర రూ.330 నుంచి రూ.420కు చేరింది. ఇవి అప్పటి మార్కెట్ ధరలు మాత్రమే; అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా ఉండవు.

కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ వెల్లడించిన సెప్టెంబర్ 2026 గణాంకాల ప్రకారం దేశవ్యాప్త చిల్లర ద్రవ్యోల్బణం 5.54 శాతంగా, ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతంగా నమోదయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం 8.06 శాతానికి చేరడం ఆందోళనకరం. ఇవి జాతీయ గణాంకాలే తప్ప తెలంగాణకు ప్రత్యేకమైనవి కావు.

నవంబర్ 2న నమోదైన తెలంగాణ సగటు చిల్లర ధరల ప్రకారం వేరుశనగ నూనె లీటరు రూ.195.09, పాలు రూ.69.09, చక్కెర కిలో రూ.54.55గా ఉన్నాయి. ఇవి సాధారణ కుటుంబాల ఆహార వ్యయాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడే గణాంకాలు.

ధరల పెరుగుదల కేవలం ఆర్థిక సమస్య కాదు. కుటుంబాల పోషకాహారం, పిల్లల చదువులు, వైద్య అవసరాలు, భవిష్యత్తు పొదుపును ప్రభావితం చేసే సామాజిక సమస్య. ముఖ్యంగా రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, పింఛనుదారులు తమ పరిమిత ఆదాయంతో పెరుగుతున్న ఖర్చులను భరించడం కష్టమవుతోంది.

వాతావరణ ప్రతికూలతలు, పంట దిగుబడుల్లో హెచ్చుతగ్గులు, రవాణా వ్యయం, సరఫరా అంతరాయాలు ధరలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల వ్యవసాయోత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, రైతు బజార్లను బలోపేతం చేయడం, మధ్యవర్తుల సంఖ్యను తగ్గించడం అవసరం. మార్కెట్ ధరలపై పారదర్శక సమాచారం అందుబాటులో ఉంచాలి. కృత్రిమ కొరత, అక్రమ నిల్వలను నివారించాలి.

రైతుకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు వినియోగదారుడికి సరసమైన ధరకు నిత్యావసరాలు అందే వ్యవస్థను నిర్మించాలి. ఆదాయ వృద్ధితోపాటు ప్రజల కొనుగోలు శక్తిని పరిరక్షించడంపైనా దృష్టి సారించాలి.

అభివృద్ధికి అసలైన కొలమానం ఆర్థిక గణాంకాల్లో కనిపించే వృద్ధి మాత్రమే కాదు; సామాన్యుడి భోజనపళ్లెంలో కనిపించే ఆహార భద్రత కూడా!

ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ.. సుప్రీంకోర్టులో పిటిషన్





ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ పిటిషనర్ అరుణ్ కుమార్ అగర్వాల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిందిసిద్దు స్టింగ్ వీడియో కేసులో కుమారస్వామి సహాయకుడి విచారణ 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్'లోని సెక్షన్ 16 ఇప్పుడు వివాదానికి కారణమైంది. ఈ నిబంధన ప్రకారం.. సీఈసీ లేదా ఎన్నికల కమిషనర్ అధికారిక విధుల నిర్వహణలో చేసిన లేదా మాట్లాడిన విషయాలపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులను కూడా కొనసాగించకూడదు. పదవిలో ఉన్నప్పుడే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ నిబంధన ఎన్నికల కమిషనర్లకు అవసరానికి మించిన రక్షణ కల్పిస్తోందని పిటిషనర్లు వాదిస్తున్నారు అధికారిక విధుల పేరుతో తప్పులు చేసినా, దురుద్దేశంతో వ్యవహరించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని పేర్కొంటున్నారు. ఇది రాజ్యాంగంలోని 14, 21వ అధికరణాలతో పాటు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, న్యాయవాది అరుణ్ కుమార్ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది ఓటరు జాబితా నుంచి తప్పుగా పేరు తొలగించినా, అభ్యర్థికి అన్యాయం జరిగినా, ఎన్నికల సంఘంలో అవినీతి జరిగినా బాధితులకు న్యాయపరమైన పరిష్కారం లేకుండా పోతుందని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత 2023 బిల్లులో ఎన్నికల కమిషనర్లకు ఇలాంటి సంపూర్ణ రక్షణ కల్పించే నిబంధన లేదని, అనంతరం బిల్లుకు సవరణ ద్వారా సెక్షన్ 16ను చేర్చారని, ఇందుకు తగిన కారణాలను ప్రభుత్వం వెల్లడించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎంపీలు పెద్ద సంఖ్యలో సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో ఈ రక్షణ నిబంధనతో కూడిన బిల్లును పార్లమెంట్ ఆమోదించిందని పిటిషనర్ పేర్కొన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు..

భద్రాద్రి జిల్లాలో జలమయమైన రహదారులు



ములకలపల్లి, నవంబర్ 4: మురసు తుఫాన్ ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులు జలమయమవ్వగా.. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. పాల్వంచ నుంచి మాదారం మీదుగా అన్నపురెడ్డిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై సత్యంపేట గ్రామం వద్ద పాములేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు పాల్వంచ నుంచి దమ్మపేట వెళ్లే ప్రధాన రహదారిపై రాజుపేట శివారులో పాములేరు వాగుపై ఇటీవల కూలిన వంతెన పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక అప్రోచ్ కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఈ రెండు మార్గాల్లో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు భారీ వర్షాలతో మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సాగు చేస్తున్న వరి, మిర్చి, పుచ్చ, శనగ తదితర పంటలు నీట మునుగుతున్నాయి. ఇప్పటికే వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు తాజా వర్షాలు మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు.

బేతుపల్లి చెరువు అలుగు వద్ద పెను విషాదం!

వరద ఉధృతిలో 9 మంది గల్లంతు.. గాలింపు చర్యలు ముమ్మరం.









సత్తుపల్లి: బేతుపల్లి చెరువు అలుగు వద్ద వరద ఉధృతి తీవ్రరూపం దాల్చడంతో పెను విషాదకర ఘటన చోటుచేసుకుంది. వరద నీటిలో చిక్కుకున్న ఎనిమిది మందిని రక్షించేందుకు రెండు బోట్లలో రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగగా, అనూహ్యంగా వరద ప్రవాహం మరింత పెరగడంతో రక్షణ చర్యలకు వెళ్లిన రెండు బోట్లు సైతం వరదలో కొట్టుకుపోయినట్లు సమాచారం. దీంతో మొదట చిక్కుకున్న ఎనిమిది మందితో పాటు రెస్క్యూ బృందాల సభ్యులు కలిపి మొత్తం తొమ్మిది మంది గల్లంతైనట్లు ప్రాథమిక సమాచారం. ప్రస్తుతం వారి ఆచూకీ తెలియకపోవడంతో తీవ్ర ఆందోళన నెలకొంది.

?మరోవైపు బేతుపల్లి చెరువు అలుగు మీదుగా సుమారు మూడు అడుగుల మేర వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీరు దిగువన ఉన్న వేశ్యకాంతల చెరువులోకి చేరడంతో పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ప్రవాహం సత్తుపల్లి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలకు విస్తరించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని పూర్తిగా ముంచెత్తింది. ముఖ్యంగా మొదటి అంతస్తు సైతం వరద నీటితో నిండిపోవడంతో అక్కడి నివాసితులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

?పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు హుటాహుటిన స్పందించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలకు చేర్చారు. జిల్లా స్థాయి అధికారులు సైతం ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

?గల్లంతైన వారి ఆచూకీ కోసం సహాయక చర్యలు చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితి నెలకొంది. వరద ఉధృతి నేపథ్యంలో ప్రజలు చెరువులు, అలుగులు, వాగుల సమీపాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

అమెరికా మధ్యంతర ఎన్నికలు..

సత్తా చాటుతున్న భారత సంతతి అభ్యర్థులు

- అమెరికాలో కాంగ్రెస్‌పై పట్టు కోసం మధ్యంతర ఎన్నికలు

- కీలక పదవుల కోసం బరిలో నిలిచిన అనేకమంది భారత సంతతి నేతలు

- వర్జీనియా నుంచి ప్రతినిధుల సభకు సుహాస్ సుబ్రమణ్యం తిరిగి ఎన్నిక

- ఒహాయో గవర్నర్ రేసులో వెనుకంజలో వివేక్ రామస్వామి

- ఫ్లోరిడాలో పియా దండియా ఆధిక్యం..

పలుచోట్ల ఫలితాలపై ఉత్కంఠ

ఫ్లోరిడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలోని చివరి రెండేళ్లలో కాంగ్రెస్‌పై ఎవరికి పట్టు ఉంటుందో తేల్చే మధ్యంతర ఎన్నికల పోలింగ్ మంగళవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, 100 మంది సభ్యులున్న సెనెట్‌లోని 37 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకు కూడా ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతికి చెందిన అభ్యర్థులు కీలక పదవుల కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ నేత సుహాస్ సుబ్రమణ్యం ఘన విజయం సాధించారు.

వర్జీనియాలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేసిన ఆయన, 61 శాతానికి పైగా ఓట్లు సాధించి ప్రతినిధుల సభకు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డేవ్ బెక్‌విత్‌కు 36 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. గతంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్‌హౌస్‌లో టెక్నాలజీ పాలసీ సలహాదారుగా సుహాస్ పనిచేశారు. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఒహాయో గవర్నర్ పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న భారత సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామి ప్రస్తుతం వెనుకంజలో ఉన్నారు. కేరళ మూలాలున్న వివేక్‌కు అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన తన ప్రత్యర్థి, డెమోక్రటిక్ అభ్యర్థి అమీ యాక్టన్ కంటే దాదాపు 2,00,000 ఓట్ల వెనుకంజలో ఉన్నారు. మరోవైపు ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పియా దండియా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ అయిన ఆమె, రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్‌పై దాదాపు 11,000 ఓట్ల ఆధిక్యంతో ముందంజలో ఉన్నారు. సిలికాన్ వ్యాలీలోని కొన్ని ప్రాంతాలున్న కాలిఫోర్నియా 17వ డిస్ట్రిక్ట్‌లో ఇద్దరు భారత సంతతి నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇక్కడ డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నాపై రిపబ్లికన్ నేత రితేష్ టాండన్ పోటీ చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్‌లోని 7వ డిస్ట్రిక్ట్‌లో సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్‌పై మరో భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నేత నీరవ్ సేథ్ బరిలో ఉన్నారు. ఈ రెండు చోట్లా ఫలితాలు ఇంకా వెలువడలేదు. వీరితో పాటు సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యుడు అమీ బేరా (కాలిఫోర్నియా), అమీష్ షా (అరిజోనా), పూజా సేథి (టెక్సాస్), సందీప్ శ్రీవాస్తవ (టెక్సాస్) వంటి అనేకమంది భారత సంతతి అభ్యర్థులు వివిధ స్థానాల నుంచి పోటీ పడుతున్నారు. లాస్ ఏంజిల్స్ నగర మేయర్ పదవికి నిత్యా రామన్ పోటీ చేస్తున్నారు.







ఆమె గెలిస్తే, అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలైన న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌కు భారత సంతతికి చెందినవారే మేయర్లుగా ఉంటారు. కొన్ని చోట్ల ఫలితాలు వెలువడినప్పటికీ, పలువురు కీలక భారత సంతతి అభ్యర్థుల భవితవ్యం తేలాల్సి ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరు

కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ

హైదరాబాద్ అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో ట్రంప్ ఓటమితో ప్రపంచానికి మేలు జరుగుతుంది. యుద్ధ పిపాసులుగా ఉండే నేతలకు ఓటమే ఎదురవుతుందని ప్రజాశాంతి పార్టీ అధినేత కెఏ పాల్ అన్నారు. ఇజ్రాయెల్లో నెతన్యాహూ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇరాన్ యుద్ధం ఆపకపోతే మాజీ స్పీకర్గా మారతావు అంటూ స్పీకర్ మైక్ జాన్సన్ను హెచ్చరించాను. కళ్లు నెత్తికెక్కిన రాజకీయ నేతలు ఎవరికైనా ఇదే పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. నేటి ప్రపంచంలో ట్రంప్ కంటే పవర్ఫుల్ నేత ఎవరూ లేరు. ఎన్ని బెదిరింపు కాల్స్ వచ్చినా నేను ట్రంప్ తీరును వ్యతిరేకిస్తూ వచ్చాను. ఇది మన దేశంలో ముఖ్యమంత్రులు, నేతలకు కూడా హెచ్చరికే. మతం పేరుతో గొడవలు పెట్టేవారికి ఇదే నా హెచ్చరిక. బైబిల్ పంచినందుకు మహిళలపై దాడి చేస్తే.. వారిని ఇప్పటికీ అరెస్ట్ చేయలేదు. నేను భారత్ కి తిరిగి వస్తా ఒక్కొక్కరి తాట తీస్తా. నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

తుఫాను దెబ్బకు విలవిలలాడుతున్న రైతాంగం!

సత్తుపల్లి నియోజకవర్గాన్ని పంట నష్ట ప్రాంతంగా ప్రకటించాలి

తక్షణమే పంట నష్టం సర్వే చేపట్టి రైతులకు పరిహారం అందించాలి: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 4:సత్తుపల్లి నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలు, మురుసు తుఫాను ప్రభావంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు.

నవంబర్ 4న నమోదైన వర్షపాత వివరాల ప్రకారం సత్తుపల్లి నియోజకవర్గంలో 200 మిల్లీమీటర్లకు పైగా భారీ వర్షపాతం నమోదైందని, రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో సత్తుపల్లి కూడా ఒకటిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ భారీ వర్షాల కారణంగా నియోజకవర్గవ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రధానంగా వరి సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకున్న సమయంలో కురిసిన భారీ వర్షాలకు పొలాలు నీటమునిగి, పంట నేలకొరిగిందని, చేతికి రావాల్సిన పంట నీటిపాలైందని పేర్కొన్నారు. అనేక పొలాల్లో నడుములోతు నీరు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.

ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరి రైతులకు మురుసు తుఫాను రూపంలో మరో భారీ దెబ్బ తగిలిందన్నారు. వరితో పాటు పత్తి రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని, తీత దశలో ఉన్న పత్తి వర్షాలకు తడిసిముద్దవడంతో నాణ్యత, దిగుబడిపై తీవ్ర ప్రభావం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి వరి, పత్తి తదితర పంటలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని సండ్ర వెంకటవీరయ్య కోరారు. సర్వే నివేదికలను ఆలస్యం చేయకుండా ప్రభుత్వానికి పంపి సత్తుపల్లి నియోజకవర్గాన్ని పంట నష్ట ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యంతో తీవ్రంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి, అర్హులైన రైతులందరికీ నిబంధనల ప్రకారం కాకుండా తగిన పంట నష్టపరిహారాన్ని త్వరితగతిన అందించి అన్నదాతలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

రైతును ముంచిన మురుసు

ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు అలుగులు పడిన చెరువులు

నీట మునిగిన వరి పొలాలు, నేలరాలిన పత్తి

చేతికొచ్చిన పంట వర్షాలకు పాడవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు









చండ్రుగొండ నవంబర్ 04 ప్రజా బలం ప్రతినిధి :-చండ్రుగొండ మండల వ్యాప్తంగా మురుసు తుఫాన్ రైతుల కు అపార నష్టాన్ని మిగిల్చింది. ఒకవైపు ఎలీనీవో ఎఫెక్ట్ తో సరైన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దానికి తోడు రైతులకు సకాలంలో ఎరువులు దొరకక, 24 గంటలు విద్యుత్ అందక, నానా అవస్థలు పడ్డారు. అలాగే ప్రతి రైతు ఎకరానికి సుమారు రూ లక్ష రూపాయలు పెట్టుబడులు పెట్టారు. సరాసరి పంటలు చేతికి వచ్చే సమయానికి మురుసు తుఫాను ప్రభావం రైతుల పాలిట శాపంగా మారింది. దీంతో చేతికొచ్చిన వరి, పత్తి, మిర్చి, పంటలు భారీ వర్షాలకు నీట మునిగాయి. చండ్రుగొండ మండల వ్యాప్తంగా వరి 4200 ఎకరాలు, పత్తి 8000 వేల ఎకరాలు, మిర్చి 1600 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో తుఫాన్ ప్రభావంతో 1000 ఎకరాల వరి, 350 ఎకరాల పత్తి, 200 ఎకరాలు మిర్చి నీట మునిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పూర్తిస్థాయి నష్టం అంచనా వేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి జి వినయ్ తెలిపారు. ఇదిలా ఉండగా రైతులు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశామని. తీరా తుఫాను తమను తీవ్రంగా నష్టపరిచిందని. ప్రభుత్వం తమను నష్టపరిహారంతో ఆదుకోకపోతే అప్పుల ఊబిలోకి వెళ్లే పరిస్థితి నెలకొందని, ఆ అప్పులు కట్టలేక తమకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ప్రభుత్వం తమను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మురుసు తుఫాన్ కారణంగా చండ్రుగొండ మండలంలోని ప్రధాన నీటి ప్రాజెక్టులైన వెంగళరావు సాగర్, మద్దుకూరు ప్రాజెక్టు, పూర్తిస్థాయిలో నిండి అలుగులు పోశాయి. దీంతో సీతాయిగూడెం, చండ్రుగొండ, గుర్రాయిగూడెం రహదారిపై ఉన్న బ్రిడ్జి పైనుంచి వరద పోటెత్తడంతో అధికారులు వెంటనే స్పందించి రహదారిని మూసివేశారు. అలాగే బాల్యతండ వాగు పొంగటంతో పోకలగూడెం బాల్య తండా రహదారిపై వరద నీరు భారీగా ప్రవహించడంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే చెరువులకు, కుంటలకు, భారీగా వరద నీరు చేరడంతో చెరువులన్నీ అలుగులు పోసాయి. భారీ వర్షానికి తిప్పనపల్లి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో రెండు అడుగుల మేర వర్షం నీరు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే అయ్యన్నపాలెం రావికంపాడు గ్రామాల్లో ఉన్న ఇండ్లలోకి వర్షం నీరు చేరి ఇండ్లు నీట మునిగాయి. అలాగే మట్టి ఇళ్లకు ఉన్న గోడలు భారీగా పగుళ్లు ఏర్పడి కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. తుఫాన్ ప్రభావంతో రెవిన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, శాఖ అధికారులు అప్రమత్తమై గ్రామాల్లో ఎప్పటి కప్పుడు తుఫాన్ ప్రభావాన్ని పరిశీలిస్తూ ప్రజలకు తగు జాగ్రత్తలు, సూచనలు ఇస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

నేడు అంసాన్ పల్లి పరిధిలో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా బంద్

విద్యుత్ శాఖ ఏఈ హైమద్ అలీ



కొల్చారం, నవంబర్ 04 (ప్రజాబలం): ప్రతినిధికొల్చారం మండలంలోని 33/11 కేవీ అంసాన్ పల్లిసబ్‌స్టేషన్ పరిధిలో నేడు అనగా 5 నవంబర్ 2026 రోజున మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొల్చారం విద్యుత్ శాఖ ఏఈ హైమద్ అలీ తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో పాటు నూతన ఏ బి స్విచ్ ఏర్పాటు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కొల్చారం మండల ఏఈ అహ్మద్ అలీ కోరడం జరిగింది.

పైతర గ్రామంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం

కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి



కొల్చారం, నవంబర్ 04(ప్రజాబలం): ప్రతినిధికొల్చారం మండలంలోని పైతర గ్రామంలో కేక్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్ నీ నో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ఏఈ సూచించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి నేలను కాపాడుకోవాలని, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ , ఏఈఓ అమృత, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం--2026..

పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే.



జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి) నవంబర్ 4 నేడు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో పెద్దఎత్తున నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం--2026 వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి యాదవ సోదర సోదరీమణులందరికీ హైదరాబాద్ సదర్ ఉత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, వీరత్వం, ఐక్యతను చాటిచెప్పే సదర్ ఉత్సవాలు ఎంతో విశిష్టమైనవని పేర్కొన్నారు..ఈ సదర్ ఉత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ , బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , మల్లు రవి , ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంపీ ధర్మేంద్ర యాదవ్ , పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పలువురు ప్రజాప్రతినిధులు, శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ , వివిధ రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రతినిధులు పాల్గొన్నారు..



కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్న వైన్ షాప్

లపై ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04ములుగు జిల్లాలో వైన్ షాప్ నిర్వాకుల వ్యవహారం శర మాములే మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగిపోతుంది ఎక్సైంజ్ అధికారులు అండదండలు పోలీస్ అధికారుల చిన్నచూపుతో వైన్ షాప్ యజమానులు ఇష్టానుసారంగా కల్తీ మద్యం తయారు చేసి వినియోగదారులను అనారోగ్యాలకు గురి చేస్తున్న పరిస్థితి ములుగు జిల్లాలో వెలుగు చూసింది ముఖ్యంగా ఉన్నత అధికారుల కార్యాలయాలకు కూత వేటు దూరంలో లేని



వైన్ షాపులు అక్రమ మద్యం తయారుచేసి విక్రయిస్తుంటే ఇటు పోలీసు అధికారులు జిల్లా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంపై పలు అనుమానాలు దారితీస్తున్నాయి ఎమ్మార్పీ రేట్ల కన్నా అతి ఎక్కువ అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న వైన్ షాప్ నిర్వాహకులు ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన వైన్ షాపుల నిర్వాకం

ములుగు జిల్లా కేంద్రంలోని రెడ్డి వైన్స్ లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు..

కల్తీ మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో సోదాలు..

పలు మద్యం బాటిలతోపాటు ఒక వాహనం సీజ్..

టెస్టింగ్ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న ఎక్సైజ్ అధికారులు..

దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా ఎక్సైజ్ అధికారుల దాడులు కండ్ల ముందు అంత దంద జరుగుతున్న పట్టించుకోకపోవడంతో సమాచారం అందిస్తేనే తప్ప ఏం చేయలేని పరిస్థితి మనకు జిల్లా యంత్రాంగంలో కనబడుతుంది ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు కళ్ళు తెరిచి ప్రజల ప్రాణాలతో చెలగాటం మాడుతున్న వైన్ షాప్ లను సీజ్ చేసి షాప్ ను రద్దు చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు

బలుపా... వాపా
ఏపీ ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు

రాజమండ్రి, నవంబర్ 4, స్థానిక సంస్థల ఎన్నికలు ఫలితాలు చూసి మురిసిపోవడం వృధా. గతంలో జగన్ ఇలాగే సంబరపడి సాధారణ ఎన్నికల్లో చతికలపడ్డారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలకు, సాధారణ ఎన్నికల ఫలితాలకు పొంతన ఉండదు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ అధికార పార్టీ వైపు అనుకూలంగా ఉంటాయి. ఇంకా మూడేళ్ల కాలపరిమితి ఉండటంతో సహజంగానే ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి అధికార పార్టీతోనే సాధ్యమవుతుందని నమ్ముతారు. నిధుల విడుదల, సమస్యల పరిష్కారం అధికార పార్టీతోనే వీలవుతుందని నమ్మి వారికే ఓటు వేస్తారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా అదే పరిస్థితి. వైసీపీ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో తాడిపత్రి మున్సిపాలిటీ ఒక్కటి మాత్రమే టీడీపీ గెలిచింది. మూడేళ్లలో పరిస్థితి మారి 2024 ఎన్నికల్లో కూటమి విజయ దుందుభి మోగించిన విషయాన్ని మర్చిపోకూడదు.. స్థానికసంస్థల ఎన్నికలకు, సాధారణ ఎన్నికలకు సంబంధమే ఉండదు. ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా, తమకు అనుకూలమని అనిపించేవారికే ఓటు వేస్తారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంపై రాజకీయ వర్గాల్లో మరియు ప్రజల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ఫలితాల సరళిని బట్టి విశ్లేషకులు పలు రకాల విశ్లేషణలు చేపడుతున్నారు. రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుండి కుప్పం వరకు మున్సిపాలిటీలలో లభించిన ఈ విజయం ప్రజలు కూటమి సుపరిపాలనపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని చంకలు గుద్దుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో స్థానిక సంస్థల్లో నిధులు సక్రమంగా వినియోగించబడి, గ్రామాలు మరియు పట్టణాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు. కానీ సాధారణ ఎన్నికల్లో ప్రజల మైండ్ సెట్ మారే అవకాశాలు లేకపోలేదు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ ఫలితాలపై భిన్నమైన ఆరోపణలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికార బలాన్ని, అధికారులను ఉపయోగించి ఏకపక్షంగా వ్యవహరించిందని, ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లను అక్రమంగా తిరస్కరింపజేసి ఈ విజయాన్ని సాధించిందని వారు విమర్శిస్తున్నారు. ఈ గెలుపు కేవలం సాంకేతికపరమైన మరియు రాజకీయ వ్యూహాత్మక ఒత్తిళ్ల వల్లే సాధ్యమైందని, దీనిని నిజమైన ప్రజా విజయంగా భావించలేమని ప్రతిపక్ష శ్రేణులు వాదిస్తున్నాయి.ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల విజయాలు అనేవి ప్రజల ఆకాంక్షలు మరియు ఆయా సమయాల్లోని రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉంటాయి. విజేతలు దీనిని బాధ్యతగా భావించి స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సి ఉండగా, విమర్శలను కూడా పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ముందుకు సాగడం అవసరం. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు అనేది ప్రభుత్వ పాలనకు, వారిపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని వీరు భావిస్తారు. ఈ విజయాలు పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతాయని, క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును మరింత బలోపేతం చేస్తాయని నమ్ముతూ వారు సంబరాలు చేసుకుంటారు. స్థానిక ఎన్నికల్లో సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే అనుకూల వాతావరణం ఉంటుంది. అధికార బలం, పోలీసు వ్యవస్థ లేదా ఇతర వనరుల వినియోగం వల్లనే ఈ గెలుపు సాధ్యమైందనే ఆరోపణలు ఉంటాయి.స్థానిక సమస్యల ఆధారంగా జరిగే ఈ ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ రాష్ట్ర లేదా జాతీయ స్థాయి రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా ప్రతిబింబించలేవు.

ఓట్ల బదిలీ .. యధాతథం...

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఒక స్పష్టత నిచ్చాయి. ఇన్నాళ్లూ ఉన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ ల మధ్య పై స్థాయిలో సఖ్యత ఉన్నా కింది స్థాయి క్యాడర్ లో ఆ సమన్వయం ఉంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే కూటమి పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటుతో పాటు ఆశావహులు ఎక్కువగా ఉండటం, టిక్కెట్ దక్కని వాళ్లు నిరాశకు గురి కావడంతో నిన్నటి వరకూ కొంత శషభిషలు ఉండేవి. అయితే ఫలితాలను చూస్తుంటే మాత్రం కూటమి పార్టీల మధ్య సమన్వయం ఉన్నట్లు స్పష్టంగా కనిపించింది. అదే సమయంలో ఓట్ల బదిలీ కూడా ఖచ్చితంగానే జరిగిందని చెప్పాలి.ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల మధ్య సీట్ల పంపకాలు, సమన్వయం మరియు ఓట్ల బదిలీ కీలక పాత్ర పోషించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటును అధికారికంగా ఖరారు చేశారు. అనేక దఫాలుగా సమావేశమై మేయర్, ఛైర్మన్ పదవుల పంపకం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఎక్కువ స్థానాల్లో బరిలోకి దిగగా, జనసేన పార్టీ బీజేపీ లు మిగిలిన స్థానాల్లో బరిలోకి దిగాయి. కొన్ని చోట్ల ఏకగ్రీవమయ్యాయి. మరికొన్ని చోట్ల నామినేషన్ల సందర్భంగా స్క్రూటినీలో ప్రత్యర్థులకు చెందిన నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురి కావడంతో అక్కడ ఎన్నిక నామమాత్రమయింది. మరికొన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు మధ్యలోనే బరిలో నుంచి పక్కకు తప్పుకున్నారు.మూడు పార్టీల మధ్య ఓట్ల చీలికను అరికట్టడానికి ముందస్తుగా సీట్ల పంపకాలు పూర్తి చేసుకుని వ్యూహాత్మకంగా అభ్యర్థులను నిలబెట్టాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం స్థానిక నాయకుల మధ్య ఆశావహుల పోటీ వల్ల సమన్వయ లోపాలు తలెత్తినప్పటికీ, పెద్ద ఎత్తున ఓట్ల బదిలీ కూటమికి కలిసొచ్చింది. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపులో కూటమి పార్టీలు ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శిస్తూ విజయపథంలో దూసుకెళ్లాయి. ఎక్కడా అభ్యర్థిని చూడకుండా పార్టీని చూసి ఓటు వేసినట్లు కనిపించింది. అందుకే ఎక్కువ శాతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. పార్టీ అధినేతలు కూడా రెబెల్స్ ను పోటీ నుంచి తప్పుకోవాలని, లేకుంటే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని ప్రకటించడం కూడా కొంత కూటమికి కలసి వచ్చిందనే చెప్పాలి. మరో మూడేళ్లు రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉంటుంది కాబట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలుపెంచుకుని తమ ప్రాంత అభివృద్ధి కి చేయూత నివ్వాలని ప్రజలు భావించినట్లుంది.

మరోసారి కోలుకోలేని వైఎస్సార్‌సీపీ దెబ్బ

విజయవాడ, నవంబర్ 4,ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల సరళి వైఎస్సార్‌సీపీకి మరోసారి కోలుకోలేని దెబ్బకొడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి హవా స్పష్టంగా కనిపిస్తుంటే, వైఎస్సార్‌సీపీ మాత్రం ఎక్కడో ఒకట్రెండు వార్డులు లేదా స్వల్ప ఓట్ల ఆధిక్యం దక్కినా దాన్నే ఏదో మెగా విజయంలా ప్రచారం చేసుకుంటోంది.అసలు తమకు ప్రజలు ఓట్లేయరని, కూటమి వేవ్‌లో తాము కొట్టుకుపోవడం ఖాయమని ఆ పార్టీ నాయకత్వానికి ముందే గట్టి నమ్మకం కుదిరినట్లుంది. అందుకే, ఆశించిన స్థాయి కంటే ఘోర పరాజయం ఎదురవుతున్నా, ఎక్కడో ఒకచోట లభించిన చిన్నిపాటి లీడ్‌ను పట్టుకుని ఓదార్పు వెతుక్కునే పనిలో పడ్డారు.సాక్షి మీడియా నెట్‌వర్క్‌తో పాటు సదరు పార్టీ సోషల్ మీడియా సైన్యం ప్రదర్శిస్తున్న వైఖరి ప్రజాస్వామ్యానికి నవ్వులాటగా మారింది. కూటమి అభ్యర్థులు వందలాది వార్డులలో, పోస్టల్ బ్యాలెట్లలో భారీ మెజారిటీతో దూసుకుపోతుంటే.. వాటిని కప్పిపుచ్చి, వైఎస్సార్‌సీపీకి అత్యంత అరుదుగా ఆధిక్యం వచ్చిన వార్డుల గణాంకాలను మాత్రమే హైలైట్ చేస్తూ స్క్రీన్లు నింపేస్తున్నారు. ఎక్కడో ఒక రౌండ్‌లో తాత్కాలికంగా ముందంజలోకి రాగానే, ఆ ప్యాచ్‌లను కట్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఏదో జగజ్జేతల్లా సంబరాలు చేసుకోవడం వారి ఆత్మవంచనకు, అంధకార ప్రతిపక్ష రాజకీయాలకు అద్దం పడుతోందిఅత్యంత విచిత్రమైన అంశమేమిటంటే.. అసలు పోలింగ్ రోజే మున్సిపల్ ఎన్నికలు అక్రమంగా జరిగాయని, తమ ఏజెంట్లను తరిమేశారని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని విపరీతంగా రచ్చ చేశారు. ఆఖరికి పులివెందుల మున్సిపాలిటీలో వైఎస్ జగన్ రెడ్డి తన సొంత ఓటును కూడా వేయకుండా బహిష్కరించి, రీపోలింగ్ కావాలంటూ ధర్నాలు చేశారు. కానీ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై, అదే ఎన్నికల్లో పొరపాటున ఎక్కడైనా ఒకటి రెండు వార్డుల్లో వైఎస్సార్‌సీపీకి లీడ్ లేదా విజయం దక్కగానే క్షణాల్లో మాట మార్చేస్తున్నారు. అక్రమాలు జరిగాయన్న నోళ్లతోనే ఇప్పుడు ఆ ఓట్లను ప్రజాదరణ గా ప్రచారం చేసుకుంటూ ద్వంద్వ నీతిని చాటుకుంటున్నారు.దాదాపు అన్ని పట్టణ ప్రాంతాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నుంచే కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరుస్తూ విజయకేతనం ఎగురవేస్తోంది. వాస్తవాన్ని ఒప్పుకునే ధైర్యం లేక, ప్రజా తీర్పును గౌరవించే మానసిక పరిపక్వత లేక వైఎస్సార్‌సీపీ ఇలాంటి మైండ్ గేమ్స్‌కు తెరలేపుతోంది. ఎన్నికలు సరిగ్గా జరగలేదని ఒకవైపు విమర్శిస్తూనే, మరోవైపు వచ్చిన కొద్దిపాటి ఫలితాలకే భుజాలు తడుముకోవడం ఆ పార్టీ పతనానికి నిదర్శనం. ప్రజలు పూర్తిగా తిరస్కరించినా, సాక్షి రాతలతోనూ, పేక్ సోషల్ మీడియా పోస్టులతోనూ కాలాన్ని వెళ్లదీయవచ్చనే భ్రమల్లో వైఎస్సార్‌సీపీ బతుకుతోందని ఈ ఎన్నికల కౌంటింగ్ దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి.

తిరుమల శ్రీవారి మెట్లపై గుండెపోటుతో ఎన్నారై మృతి



తిరుమల శ్రీవారి దర్శనానికి శ్రీవారి మెట్టు నడక మార్గంలో వెళ్తున్న భక్తుడు గుండెపోటుతో మృతిచెందాడు. 800వ మెట్టు వద్ద సింగిరెడ్డి సుర్జిత్ రెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. భద్రతా సిబ్బంది అతడిని కిందకు తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిగొస్తున్న కూరగాయల ధరలు

హైదరాబాద్, నవంబర్ 5, తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. వంటిల్లో రోజూ ఉపయోగించే టమాటా, ఉల్లిపాయలు ధరలు అదుపులో ఉన్నాయి. మొన్నటివరకు వీటి ధరలు భగ్గుమనగా.. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీపావళి పండుగ సీజన్ క్రమంలో ధరలు చౌకకే దొరకడంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు.

ఎల్‌నినో ప్రభావం వల్ల ఇటీవల ధరలు పెరిగాయి. కూరగాయలకు డిమాండ్ ఉండటంతో ధరలు పెరిగాయి. అయితే ఇప్పుడు పంట మార్కెట్‌కు వస్తుండటంతో సరఫరా పెరిగింది. ఈ కారణంతో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో ఈ పరిణామం పండుగ వేళ సామాన్యుల ఇంటి బడ్జెట్‌ను తగ్గిస్తోంది. పండుగ సమయాల్లో ఇంట్లో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కిరాణా సరుకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇక రకరకాల వంటలు వడేందుకు కూరగాయల అవసరం ఎక్కువగా ఉంటుంది. ధరలు తగ్గడం పండక్కి ముందే ఊరటగా కల్గిస్తోంది.కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లోని నవంబర్ 3వ తేదీన కిలో టమాట రూ. 29, వంకాయ రూ. 18, బెండకాయ రూ. 45, పచ్చిమిర్చి రూ. 45, బజ్జి మిర్చి రూ. 60, కాకరకాయ రూ. 35, బీరకాయ రూ. 35, క్యాబేజీ రూ. 13, బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 43, గోబీపువ్వు రూ. 25, దొండకాయ రూ. 23, చిక్కుడుకాయ రూ. 45, గోరుచిక్కుడు రూ. 35, బీట్‌రూట్ రూ. 19కు విక్రయిస్తున్నారు. ఇఖ క్యాప్సికమ్ రూ. 45, బంగాళాదుంప రూ. 19, కీర (లోకల్) రూ. 23, కీర (ఇటాలియన్) రూ. 35, దోసకాయ రూ. 18, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ. 22 పలుకుతున్నాయి. అలాగే కిలో కంద రూ. 35, ఉల్లికాడలు రూ. 55, ఉల్లిగడ్డ రూ. 40, పచ్చి మామిడికాయ ఒక్కొక్కటి రూ. 15-20, అరటికాయ ఒక్కొక్కటి రూ. 9-10, చామగడ్డ రూ. 35, ముల్లంగి ఒక్కొక్కటి రూ. 6-8, చిలగడదుంప రూ. 35, గుమ్మడికాయ రూ. 25, నిమ్మకాయలు డజను రూ. 50-60కు లభిస్తున్నాయి. అలాగే మునగకాయలు ఒక్కొక్కటి రూ. 8-10, బొప్పాయి రూ. 50, పుట్టగొడుగులు (200 గ్రా.) రూ. 50, ఎండుమిర్చి రూ. 280, పాత అల్లం రూ. 180, కొత్త అల్లం రూ. 120, వెల్లుల్లి రూ. 260, చింతపండు రూ. 160, పండుమిర్చి రూ. 80, ఉసిరి రూ. 45, కరివేపాకు రూ. 80, పర్వల్ రూ. 28, పల్లికాయ రూ. 55, లోబియా రూ. 28, ఆగాకరకాయ కిలో రూ. 85గా ఉన్నాయి.విజయవాడలోని రైతు బజార్లలో కిలో టమాట రూ.39, బెండ రూ.24, పచ్చిమిర్చి రూ.34, కాకర రూ.34, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండ రూ.24, బంగాళదుంప రూ.25, ఉల్లిపాయలు రూ.39, గోరుచిక్కుళ్లు రూ.32, దోస రూ.20, చామదుంప రూ.34, అల్లం రూ.76, కంద రూ.34, బీట్ రూట్ రూ.36, కీరదోస రూ.46, బీన్స్ రూ.105, క్యాప్సికం రూ.60, చింతకాయలు రూ.100 పలుకుతున్నాయి

ఓట్ల చీలిక ఎవరికి దెబ్బ

లక్నో, నవంబర్ 5, (న్యూస్ పల్స్) యూపీలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ఆధిపత్యానికి మునుపెన్నడూ లేనంతగా సవాళ్లు ఎదురవుతున్నాయి. జాతీయ భద్రత, బలమైన కేంద్ర నాయకత్వం ప్రధాన అజెండాగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లోనే యూపీ ఓటర్లు బీజేపీకి ఊహించని షాక్ ఇవ్వడం పార్టీకి మేల్కొలుపుగా మారింది. దాదాపు దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌పై పాలనాపరమైన అసంతృప్తి క్షేత్రస్థాయిలో విస్తరిస్తోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. జాతీయ నినాదాలే పూర్తిస్థాయిలో ప్రభావం చూపలేకపోయిన తరుణంలో, పూర్తిగా స్థానిక, సామాజిక అంశాల చుట్టూ తిరిగే అసెంబ్లీ సమరంలో కమలనాథులకు పెను పరీక్ష తప్పేలా లేదు.యోగి ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి ప్రధానంగా నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీకేజీలు, వ్యవసాయ సంక్షోభం, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వంటి క్షేత్రస్థాయి సమస్యలే ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. వీటికితోడు శాంతిభద్రతల పేరిట జరిగిన కొన్ని కఠిన చర్యలు, బుల్డోజర్ న్యాయం కొన్ని సామాజిక వర్గాల్లో భయాందోళనలను, వ్యతిరేకతను పెంచాయి. ముఖ్యంగా ఓబీసీ, దళిత వర్గాలలో ప్రభుత్వ ప్రాధాన్యతలపై తలెత్తిన అనుమానాలు బీజేపీ సాంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక తెచ్చాయి. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం , పార్టీ క్యాడర్ మధ్య సమన్వయ లోపం, మంత్రులు-ఉపముఖ్యమంత్రుల మధ్య తలెత్తిన అంతర్గత విభేదాలు కూడా పాలనపై ప్రభావం చూపుతున్నాయి.ఈ రాజకీయ శూన్యతను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అత్యంత చాకచక్యంగా తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. గతంలో ఉన్న కేవలం యాదవ-ముస్లిం సమీకరణ పరిధిని దాటి, ఆయన ప్రయోగించిన పీడీఏ వెనుకబడిన, దళిత, మైనారిటీ వర్గాలు సామాజిక ఫార్ములా క్షేత్రస్థాయిలో విస్తృత ఆదరణ పొందుతోంది. రాజ్యాంగ పరిరక్షణ, కులగణన, రిజర్వేషన్ల హక్కుల పరిరక్షణను ప్రధాన అజెండాగా మార్చి అఖిలేష్ నిరంతరం ప్రజల్లో ఉండటం సమాజ్‌వాదీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. బహుజన్ సమాజ్ పార్టీ ప్రభావం గణనీయంగా తగ్గడంతో, బీజేపీ వ్యతిరేక ఓటుకు ఎస్పీయే ఏకైక ప్రత్యామ్నాయంగా నిలవడం అఖిలేష్ రాజకీయ గ్రాఫ్‌ను భారీగా పెంచింది.అయితే రాబోయే రాజకీయ పోరులో బీజేపీని ఎదుర్కోవడం అఖిలేష్‌కు నల్లేరుపై నడకేమీ కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు వ్యక్తిగతంగా ఉన్న బలమైన హిందుత్వ ఇమేజ్, బీజేపీకి ఉన్న పటిష్టమైన బూత్ స్థాయి నెట్‌వర్క్, కేంద్ర పథకాల లబ్ధిదారుల వర్గం ఇప్పటికీ కాషాయ పార్టీకి కొండంత అండగా ఉన్నాయి. లోక్‌సభ ఎదురుదెబ్బల తర్వాత బీజేపీ సైతం దిద్దుబాటు చర్యలు చేపడుతూ, నాన్-యాదవ్ ఓబీసీలు, దళిత వర్గాలను తిరిగి ఆకర్షించేం దుకు వ్యూహాత్మక మార్పులు చేస్తోంది. అఖిలేష్ హవా కొనసాగుతున్నప్పటికీ, తీవ్రస్థాయికి చేరిన ప్రభుత్వ వ్యతిరేకతను తన సంకీర్ణ కూటమి ద్వారా అసెంబ్లీ సీట్లుగా ఎంతవరకు మలచగలరన్న దానిపైనే యూపీ తదుపరి రాజకీయ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ

న్యూయార్క్, నవంబర్ 5, అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలో సుమారు 20 వేల వివాదాస్పద మెయిల్ బ్యాలెట్లను పక్కన పెట్టాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. చివరకు అమెరికా సుప్రీంకోర్టు కూడా ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది.కాలిఫోర్నియాలో సుమారు 20 వేల మంది ఓటర్లు అమెరికా పౌరులు కాకపోవచ్చని ట్రంప్ ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేసింది.వీరు ఓటు వేయడానికి అర్హులు కాదని అమెరికా న్యాయశాఖ ఆరోపించింది.ఈ ఓటర్లకు సంబంధించిన బ్యాలెట్లను వెంటనే పక్కన పెట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను కోరింది.ట్రంప్ సర్కార్ ఆరోపణలపై కాలి ఫోర్నియా ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీనికి కాలిఫోర్నియా పలు అంశాలను లేవనెత్తింది. ఇందులో..కాలిఫోర్నియాలో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది.లక్షలాది మంది ఓటర్లు తమ బ్యాలెట్లను తిరిగి పంపించారు.ట్రంప్ ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో అనేక తప్పులున్నాయని కాలిఫోర్నియా అధికారులు వాదించారు.ఆ జాబితాలో అమెరికా పౌరులు, ఓటరు నమోదును క్రియాశీలంగా కొనసాగించని వ్యక్తులు కూడా ఉన్నారని పేర్కొన్నారు.ట్రంప్ ప్రభుత్వం బ్యాలెట్లను వేరు చేయాలంటూ ఫెడరల్ కోర్టును ఆశ్రయించింది.అయితే జిల్లా కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది.ఆ తర్వాత 9వ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టులోనూ 2-1 మెజారిటీతో ట్రంప్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఓటు హక్కు ఉన్నవారి ఓట్లు కూడా చెల్లకుండా పోయే ప్రమాదం ఉందని న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారునవంబర్ 2, 2026న ట్రంప్ ప్రభుత్వం అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వివాదాస్పద బ్యాలెట్లను తాత్కాలికంగా పక్కన పెట్టాలని అత్యవసరంగా కోరింది.కానీ సుప్రీంకోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో ఈడీ దూకుడు

మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంలోనూ సోదాలు

మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు

హైదరాబాద్ ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ ఉదయం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తోంది.ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి, మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాలు, మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్ సహా మొత్తం ఏడు చోట్ల ఈ తనిఖీలు జరుగుతున్నాయి. ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు.గత ప్రభుత్వ హయాంలో 2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. 2020లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. అయితే, జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరిపిన సిట్... మంగళగిరి వద్ద హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో 84 రోజుల పాటు మూల్యాంకనం చేశారని, అర్హత లేని 66 మందితో జవాబు పత్రాలను దిద్దించారని తన నివేదికలో తేల్చింది.ఈ మూల్యాంకనం కోసం క్యామ్‌సైన్ మీడియాకు రూ.1.14 కోట్లు, ఇతర సంస్థలకు రూ.1.38 కోట్లు చెల్లించినట్లు సిట్ గుర్తించింది. ఈ నివేదిక ఆధారంగా 2025 ఏప్రిల్‌లో పోలీసులు కేసు నమోదు చేయగా, గతంలో పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్‌ను అరెస్ట్ చేశారు. సిట్ దర్యాప్తు నివేదిక ఆధారంగానే, ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి, తాజాగా సోదాలు చేపట్టింది.

దుమ్మురేపిన రెబల్స్...

విజయవాడ, నవంబర్ 5, ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల రెబల్ అభ్యర్థులు ట్విస్ట్ ఇచ్చారు. టికెట్ దక్కలేదని వెనక్కి తగ్గకుండా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ప్రధాన పార్టీల అభ్యర్థులకు షాక్ ఇచ్చారు. ఆదోనిలో జనసేన రెబల్ ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్నే దక్కించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రెబల్ అభ్యర్థులు ఊహించని విధంగా సత్తా చాటారు. పార్టీల టికెట్లు దక్కకపోయినా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ఓటర్ల మద్దతుతో విజయం సాధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం మున్సిపాలిటీలో జనసేన ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. మొత్తం 36 వార్డులున్న పిఠాపురంలో ఏకంగా పది వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో రెబల్స్ గెలుపు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో జనసేన రెబల్ అభ్యర్థి గెలిచి ఈ ఎన్నికల్లో చరిత్ర సృష్టించారు.ఇక కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జనసేన రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగిన స్వప్న మల్లప్ప నాయకర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఆదోని చైర్‌పర్సన్ స్థానం టీడీపీకి కేటాయించారు. నాగమణిని టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో జనసేన ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప నాయకర్ తన భార్య స్వప్నను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించారు. చివరకు ఆమె విజయం సాధించడంతో ఆదోని రాజకీయాల్లో ఈ ఎన్నిక ప్రత్యేకంగా నిలిచింది. స్వప్న భర్త మల్లప్ప నాయకర్ మాట్లాడుతూ.. స్వప్న గెలుపును పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తున్నామని పేర్కొన్నారు. తాను ఎప్పటికీ పవన్ అభిమానిని అని.. ఆయనతోనే ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తనకు అండగా ఉన్నారన్నారు..పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులోనూ స్వతంత్ర అభ్యర్థులు పార్టీలకు షాక్ ఇచ్చారు. నాలుగు వార్డుల్లో రెబల్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇద్దరు జనసేన రెబల్స్, ఇద్దరు టీడీపీ రెబల్ అభ్యర్థులు బరిలో నిలిచి గెలిచారు. ఇక ఏలూరు మున్సిపల్ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థులు ప్రభావం చూపించారు.

దాదాపు ఎనిమిది మంది ఇండిపెండెంట్లు విజయం సాధించారు.మొత్తంగా ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో రెబల్ అభ్యర్థుల గెలుపు ప్రధాన పార్టీలకు కొత్త రాజకీయ సమీకరణాలను తెరపైకి తెచ్చింది. పిఠాపురం, గొల్లప్రోలు, ఏలూరులో కార్పొరేటర్, కౌన్సిలర్ స్థాయిలో రెబల్స్ సత్తా చాటగా.. ఆదోనిలో ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్ని రెబల్‌గా బరిలోకి దిగిన అభ్యర్థి సొంతం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు: వేముల ప్రశాంత్ రెడ్డి



తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు.అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు. బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీ వెంకటేశ్వరరావుకు ఎన్నికల్లో తీవ్ర నిరాశ..

డిపాజిట్ గల్లంతు
విజయవాడ మేయర్ ఎన్నికల్లో ఏబీవీ ఘోర పరాజయం
ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం చేసినా ఫలితం శూన్యం
వామపక్షాలు, కాంగ్రెస్ మద్దతిచ్చినా దక్కని ఓట్లు

విజయవాడ, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర నిరాశ ఎదురైంది. ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన... తాను ఎదుర్కొన్న తొలి ఎన్నికల్లోనే చేదు అనుభవాన్ని మూటగట్టుకున్నారు. విజయవాడ మేయర్ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూశారు. ప్రధాన పార్టీలకు దీటుగా విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించినప్పటికీ, ఆయన కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన ఆయన, ఓట్ల సాధనలో మాత్రం పూర్తిగా వెనకబడ్డారు.నగరంలోని మూడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేపట్టిన ఏబీ వెంకటేశ్వరరావు



గౌరవప్రదమైన ఓట్లు సాధించడంలో పూర్తిగా విఫలమయ్యారు. అర్ధరాత్రి 1.30 గంటలకు వెలువడిన ఫలితాల్లో ఆయనకు కేవలం 11,137 ఓట్లు మాత్రమే సాధించారు. ఈ ఫలితాలు వామపక్షాల ఓటు బ్యాంకు కూడా ఆయనకు బదిలీ కాలేదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కూటమిగా ఏర్పడి మద్దతు ప్రకటించినా, ఆ ఓట్లు ఏబీవీకి పడకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రచారంలో చూపిన జోరు, ఫలితాల్లో కనిపించకపోవడంతో ఆయన వర్గీయులు నిరాశ చెందారు.

మార్కెట్‌లో రూ.9,500.. మిల్లులో రూ.8 వేలే..

ఉత్కర్ కాటన్ మిల్లులో పత్తి కొనుగోళ్లపై
బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

నర్వ: పత్తి పండించిన రైతుకు మార్కెట్‌లో ఆశించిన ధర దక్కడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా నర్వ మండలం పాతర్చేడు గ్రామ పరిధిలోని ఉత్కర్ కాటన్ మిల్లులో క్వింటాల్ పత్తిని రూ.8 వేలకే కొనుగోలు చేస్తున్నారని, మార్కెట్‌లో మాత్రం రూ.9,500 ధర ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మార్కెట్ ధరకు, మిల్లులో చెల్లిస్తున్న ధరకు మధ్య క్వింటాల్‌కు రూ.1,500 వ్యత్యాసం ఉండటంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టి పండిస్తే.. తక్కువ ధరకేనా?: పత్తి సాగు కోసం రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి, ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని పంటను



పండిస్తున్నారని మహేశ్వర్ రెడ్డి అన్నారు. తీరా పంటను విక్రయించే సమయంలో తక్కువ ధర చెల్లిస్తే రైతులకు గిట్టుబాటు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా క్వింటాల్ పత్తిని రూ.9,500 చొప్పున కొనుగోలు చేయాలని మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మిల్లులో పత్తి తూకంలోనూ మోసం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి కొనుగోళ్లను పర్యవేక్షించాలని, రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బి. ఆంజనేయులు, పార్టీ కార్యకర్తలు ఈ డిమాండ్లు చేశారు.

ఏపీ విద్యుత్ నియంత్రణ మండలికి కొత్త సారథి
ఏపీఈఆర్సీ నూతన చైర్మన్‌గా బినోయ్ కుమార్

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) నూతన చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి ఐదేళ్ల పాటు లేదా 70 ఏళ్ల వయస్సు నిండే వరకు (ఈ రెండింటిలో ఏది ముందైతే అది) ఆ పదవిలో కొనసాగుతారు.బినోయ్ కుమార్‌కు పరిపాలనా రంగంలో విశేష అనుభవం ఉంది. ఆయన మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ముఖ్యంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012-13 మధ్య కాలంలో ముఖ్యమంత్రికి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై ఆయనకు లోతైన అవగాహన ఉంది.

చదువుకు శ్రీరామ్ ఫైనాన్స్ అండ

67 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు
- ప్రతిభావంతుల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా

మహబూబాబాద్ పేదరికం ప్రతిభకు అడుకాకూడదనే లక్ష్యంతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ విద్యార్థులకు అండగా నిలిచింది.సామాజిక బాధ్యతలో భాగంగా పట్టణానికి చెందిన 67 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4,000 నుంచి రూ.4,500 వరకు స్కాలర్‌షిప్‌లు అందించి ప్రోత్సహించింది.హౌసింగ్ బోర్డు రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మహబూబాబాద్ బ్రాంచ్ మేనేజర్ పిరమళ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జేసీబీ అధ్యక్షుడు గార్లపాటి మహిపాల్ రెడ్డి, మారుతి సుజుకి మేనేజర్ శ్రీనాథ్ రెడ్డి



హాజరయ్యారు.ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే తమ ఉద్దేశమని, వచ్చే ఏడాది మరింత మందికి స్కాలర్‌షిప్‌లు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, బిజినెస్ మేనేజర్ మెరుగు భీమ్ రాజ్ తో పాటు సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలవరం-బనకచర్ల లింక్‌పై
రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ ఇస్తున్నారన్న కవిత
నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని విమర్శ
పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని సూచన

పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి - కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ



జాగృతి తరఫున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

అల్వాల్ రైతుబజార్ను తొలగించవద్దు
రైతుల జీవనోపాధిని కాపాడాలి .ఎంపి ఈటలకు రైతుల విన్నపం

మేడ్చల్ అల్వాల్ రైతుబజార్ను తొలగిస్తే 1,500 రైతు కుటుంబాలకు నష్టం కలుగుతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను రైతులు కలిసారు. అల్వాల్ రైతుబజార్ను ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం తొలగించనున్న నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్పై ఆధారపడిన సుమారు 1,500 రైతు కుటుంబాల జీవనోపాధిని కాపాడాలని ఎంపీ ఈటల రాజేందర్కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాల గ్రామాల నుంచి రైతులు ఇక్కడికి కూరగాయలు తీసుకొస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 1,000 నుంచి 1,500 మంది రైతులు, వివిధ ప్రాంతాల నుంచి కూరగాయల విక్రయాలకు వస్తున్నట్లు పేర్కొన్నారు. 1999 జనవరి 26 నుంచి సుమారు 26 ఏళ్లుగా రైతుబజార్ రైతులకు జీవనాధారంగా కొనసాగుతోందని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు తక్కువ ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారని వివరించారు.

జెనెసిస్ జర్నలిజం క్లబ్ ఆధ్వర్యంలో MIC CHECK' మాక్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహణ





హైదరాబాద్, నవంబర్ 4, 2026: (ప్రజాబలం ప్రతినిధి)ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (IFHE), హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌కు చెందిన జెనెసిస్ -- జర్నలిజం క్లబ్ ఆధ్వర్యంలో నవంబర్ 4, 2026న ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ కాన్ఫరెన్స్ హాల్‌లో »MIC CHECK!' -- మాక్ ప్రెస్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జర్నలిజం విద్యార్థులకు వాస్తవిక విలేకరుల సమావేశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించడం, రిపోర్టింగ్ నైపుణ్యాలను మెరుగుపరచడం, ప్రశ్నలు అడిగే సామర్థ్యాన్ని పెంపొందించడం, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

ఈ కార్యక్రమంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ జర్నలిజం అండ్ లా (BAJ-LL.B. Hons.) కోర్సు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాస్తవిక విలేకరుల సమావేశాన్ని తలపించేలా రూపొందించిన ఈ పోటీలో విద్యార్థులు జర్నలిస్టులు, అధికార ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధుల పాత్రలను పోషించారు. ఒక కల్పిత జాతీయ సమస్యపై నిర్వహించిన ఈ సమావేశంలో విద్యార్థులు వార్తా సేకరణ నైపుణ్యాలు, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రశ్నించే సామర్థ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన ప్రవర్తనను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమానికి ఐన్యూస్ (iNews) సీనియర్ జర్నలిస్ట్, న్యూస్ ప్రెజెంటర్ శ్రీమతి శివాని రాథోడ్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. వి6 న్యూస్, ఎన్‌టీవీ, బిగ్ టీవీ, టీవీ9 వంటి ప్రముఖ మీడియా సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన ఆమె విద్యార్థుల ప్రశ్నించే విధానం, జర్నలిస్టిక్ దృక్పథం, స్పష్టత, ఆత్మవిశ్వాసం, విలేకరుల సమావేశాన్ని సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యాన్ని పరిశీలించి మూల్యాంకనం చేశారు. ఈ సందర్భంగా ఆమె అందించిన సూచనలు, సలహాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి.

కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (IFHE) డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (డా.) విజయేందర్ కుమార్ మాట్లాడుతూ, జర్నలిజం విద్యలో ప్రాక్టికల్ లెర్నింగ్, పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణ, ప్రత్యక్ష అనుభవం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. జర్నలిజం అనేది కేవలం సమాచారాన్ని సేకరించి ప్రజలకు అందించడం మాత్రమే కాదని, వాస్తవాలను ధృవీకరించడం, అధికార వ్యవస్థలను ప్రశ్నించడం, సమాజానికి బాధ్యతాయుతమైన సమాచారాన్ని అందించడం కూడా జర్నలిస్టుల ముఖ్యమైన బాధ్యతలని వివరించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, రాజ్యాంగ విలువలు, భావప్రకటనా స్వేచ్ఛ, మానవ హక్కులు, మీడియా నైతికత, జవాబుదారీతనం వంటి అంశాలపై జర్నలిజం విద్యార్థులకు సమగ్ర అవగాహన ఉండాలని ఆయన సూచించారు. తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతపరమైన అంశాలను ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆచరణలో పెట్టడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, విశ్లేషణాత్మక ఆలోచన, వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. జెనెసిస్ జర్నలిజం క్లబ్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని ఆయన అభినందించారు.

అలాగే, భారతదేశంలో జర్నలిజం మరియు న్యాయ విద్యను సమన్వయం చేస్తూ ప్రత్యేకమైన BAJ-LL.B. (Hons.) కోర్సును ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, హైదరాబాద్ ప్రారంభించింది. జర్నలిజం మరియు న్యాయశాస్త్రాన్ని అనుసంధానం చేసే ఈ వినూత్న కోర్సు విద్యార్థులకు మీడియా రంగంతో పాటు న్యాయ వ్యవస్థపై కూడా సమగ్ర అవగాహన కల్పించే లక్ష్యంతో రూపొందించబడింది. ఈ కోర్సు ద్వారా మీడియా చట్టాలు, రాజ్యాంగం, న్యాయపరమైన రిపోర్టింగ్, జర్నలిజం నైతిక విలువలు వంటి అంశాలపై విద్యార్థులకు ప్రత్యేక పరిజ్ఞానం లభిస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ అసిస్టెంట్ డీన్ (స్టూడెంట్ యాక్టివిటీస్) డా. ఎ. అరుణ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసంలో పాఠ్యేతర, సహపాఠ్య కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

మాక్ ప్రెస్ కాన్ఫరెన్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానాన్ని వాస్తవిక పరిస్థితుల్లో అన్వయించుకునే అవకాశాన్ని కల్పిస్తాయని, భవిష్యత్తులో వారు ఎదుర్కొనే వృత్తిపరమైన సవాళ్లకు సిద్ధం చేస్తాయని ఆయన వివరించారు. విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జెనెసిస్ జర్నలిజం క్లబ్ సభ్యులు, అధ్యాపక సమన్వయకర్తలను ఆయన అభినందించారు.

జెనెసిస్ జర్నలిజం క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా. పావని కనపర్తి, డా. కె. రాకేష్ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తూ క్లబ్ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్తున్నారు. జర్నలిజం విద్యార్థులకు పరిశ్రమల అనుభవాన్ని అందించడం, మీడియా రంగంలోని నిపుణులతో పరస్పర చర్చలకు అవకాశాలు కల్పించడం, తరగతి గది బోధనను వృత్తిపరమైన ఆచరణతో అనుసంధానం చేయడం వంటి లక్ష్యాలతో క్లబ్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

కార్యక్రమం ముగింపులో న్యాయనిర్ణేత, సంస్థ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, విద్యార్థి వాలంటీర్లు, పాల్గొన్న విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు.

విద్యార్థులు సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలి

ప్రాణాపాయ సమయంలో సిపిఆర్ వలన మనిషిని బ్రతికించ వచ్చు

ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సురేష్ కుమార్





ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రి లో జీవశాస్త్ర ప్రాజెక్టు వర్క్ లో భాగంగా ఆస్పత్రికి పదవ తరగతి విద్యార్థులు అవగాహనగా కార్యక్రమంలో ఆసుపత్రిలో చికిత్స విధానం బిపి ల్యాబ్ టెస్టుల విధానాలు డయాలసిస్ పే సెంటర్ పరిస్థితులు అలాగే అవగాహన నిమిత్తం ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సురేష్ కుమార్ విద్యార్థులకు సి పి ఆర్ వలన లాభాలేమిటి అవి ఎలా చేయాలి అత్యవసర సమయాలలో వ్యక్తిని ఈ విధంగా సి పి ఆర్ చేసి బ్రతికించవచ్చు అనే దానితో పాటు ఏజెన్సీ గ్రామాలలో నివసిస్తున్న ప్రజలు చాలా ఎక్కువ తేలు కాటుకు పాముకాటుకు లోనవుతూ ఉన్నారు అలాంటి వారికి ఎలాంటి పరిస్థితులు కల్పించాలి అనే దానిపై విద్యార్థులకు పూస కూచ్చినట్టుగా తెలియజేశారు పాము కాటు వేసినప్పుడు సంబంధిత ప్రాంతాన్ని కదలనించ కుండా అలాగే పాము కాటేసిన ప్రాంతం పైన గట్టిగా కట్టు కట్టడం వలన రక్త ప్రసరణ తగ్గుతుంది దానితో మరింత ప్రమాదం వ్యక్తికి జరుగుతుంది అంటూ విద్యార్థులకు తెలియజేశారు అలాగే డీ సి హెచ్ ఓ జగదీశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల అన్ని విధాలుగా అవగాహన కలిగి ఉండి మూఢనమ్మకాలను దూరం చేయాలని వారు అన్నారు దయ్యం ఉందా దయ్యం చేసే ఆకృతులు పై విద్యార్థులకు తెలియజేస్తూ సైన్స్ పరంగా వైద్యులు తెలియజేసే విషయాలు విద్యార్థులకు తెలియజేశారు మూఢనమ్మకాలు నమ్మి ప్రజలు మోసపోవద్దని విద్యార్థులు అట్టి వాటిని నమ్మవద్దని పెద్దలకు సూచించాలని ప్రతి తల్లిదండ్రులకు అర్థమయ్యే విధంగా విద్యార్థులు తెలియజేయాలని వారు అన్నారు మూఢనమ్మకాలపై గ్రామస్తులలో మంత్రాలు తంత్రాలు దయ్యాలు ఉన్నాయని పూనంలో జ్వరం వచ్చిన ఆసుపత్రుల వద్దకు రాకుండా నాటు వైద్యాలు ఊహించుకోవడం పాము కరిచినచో మంత్రాలు చేయించుకోవడం వలన మనసులు చనిపోతారే తప్ప మరి ఏమి జరగదని వారు విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మయ్య శశిధర్ రవి తదితరులు పాల్గొన్నారు

కనుమరుగైన గాడిదల వాగు.. కబ్జాల చెరలో సహజ ప్రవాహం!

తామర చెరువు నుంచి బేతుపల్లి పెద్ద చెరువు వరకు వాగు

ఆనవాళ్లు మాయం.. వర్షం వస్తే రహదారులపైకి వరద నీరు

ఆక్రమణలు తొలగించి వాగుకు పూర్వ వైభవం తీసుకురావాలి -- బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాణోత్ విజయ్





సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి04: సత్తుపల్లి పట్టణంలో ఒకప్పుడు వర్షపు నీటిని సాఫీగా దిగువ ప్రాంతాలకు తీసుకెళ్లి చెరువులను నింపిన గాడిదల వాగు నేడు కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాణోత్ విజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. వాగు పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురై వ్యవసాయ భూములుగా మారుతుండటంతో సహజ నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ఫలితంగా వర్షాలు కురిసినప్పుడు నీరు వెళ్లేందుకు మార్గం లేక రహదారులపైకి, జనావాసాల్లోకి చేరుతోందని పేర్కొన్నారు.

సత్తుపల్లి పట్టణంలోని తామర చెరువు నుంచి అయ్యగారిపేట మీదుగా కాకర్లపల్లి నుంచి బేతుపల్లి పెద్ద చెరువు వరకు గాడిదల వాగు సహజంగా ప్రవహించేదని తెలిపారు. గతంలో ఈ వాగు ద్వారా వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు చేరుకుని చెరువుల్లోకి వెళ్లేదని, ప్రస్తుతం ఆక్రమణలు, పూడ్చివేతల కారణంగా వాగు తన అసలు స్వరూపాన్ని, ప్రవాహ మార్గాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తామర చెరువు కట్ట కింద వాగు పరిధిలోని భూములను కొందరు ఆక్రమించి వ్యవసాయ భూములుగా మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

వాగు ప్రవాహ మార్గం దెబ్బతినడంతో వర్షాకాలంలో వరద సమస్య తీవ్రంగా మారుతోందని, వర్షపు నీరు రహదారులపై నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భారీ వర్షాలు కురిస్తే సమీప జనావాసాల్లోకి నీరు చేరి ప్రజల ప్రాణాలు, ఆస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

గాడిదల వాగు ఆక్రమణలపై సంబంధిత రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు ఇప్పటికైనా స్పందించాలని విజయ్ డిమాండ్ చేశారు. పాత ప్రభుత్వ రికార్డులు, మ్యాపులు, సర్వే నంబర్ల ఆధారంగా తామర చెరువు నుంచి బేతుపల్లి పెద్ద చెరువు వరకు వాగు అసలు హద్దులను గుర్తించి సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులు ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని స్పష్టం చేశారు.

వాగులో ఏర్పడిన అడ్డంకులను తొలగించి వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో వరద ముప్పు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు నష్టం వాటిల్లిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే అధికారులు అప్రమత్తమై గాడిదల వాగు సహజ ప్రవాహ మార్గాన్ని పునరుద్ధరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాణోత్ విజయ్ డిమాండ్ చేశారు.

పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్న ఘనపూర్ సంతోష్



వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాబలం) జిల్లా వికారాబాద్: మర్పల్లి మండలం పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్న ఘనపూర్ సంతోష్ మేనల్లుడు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుడు ఆశీర్వదించాలని మా అల్లుడు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విద్యార్థులు బుద్ధి యందును జ్ఞానమందును వర్ధిల్లాలని నిండు నూరేళ్లు హ్యాపీ జర్నీ హ్యాపీ లాంగ్ లైఫ్ సంతోషంగా ఉండాలని ఘనపూర్ సంతోష్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు

ఒంగోలులో భారీ దారి దోపిడీ.. 2 కేజీల బంగారంతో ఉడాయింపు

ఒంగోలు : ఒంగోలులో బుధవారం ఉదయం భారీ దారి దోపిడీ జరిగింది. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి ఒంగోలులోని నగల దుకాణాలకు బంగారం తీసుకెళ్తున్న వ్యాపారులను కొందరు వ్యక్తులు మార్గమధ్యంలో అపహరించి దోపిడీకి పాల్పడ్డారు. ఒంగోలు రైల్వేస్టేషన్‌లో దిగి ఆటోలో వెళుతున్న వ్యాపారులను స్థానిక ఉపాస్ ఆస్పత్రి సమీపంలో కారును అడ్డుపెట్టి అటకాయించారు. వ్యాపారులను బలవంతంగా ఆటో నుంచి బయటికి లాగి తమ కారులో ఎక్కించుకొని దక్షిణ బైపాస్ సమీపంలోని డీ6 ఎక్స్‌టికా ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ వారిపై దాడి చేసి సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను దోచుకుని ఉడాయించారు. ప్రాణాలతో బయటపడిన వ్యాపారులు గాంధీరోడ్డుకు చేరుకొని దోపిడీ జరిగిన విషయాన్ని స్థానిక బంగారు వ్యాపారులకు తెలియజేశారు. వారి సహకారంతో రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ వీరానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ స్థానాన్ని ఆర్యవైశ్య మహిళకు కేటాయించాలి

ముఖ్యమంత్రి కి మణికొండ మహిళా విభాగం విజ్ఞప్తి. AVOPA మణికొండ మహిళా విభాగం

రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న MLC స్థానాన్ని ఆర్యవైశ్య మహిళలకు కేటాయించాలని ముఖ్యమంత్రి కి మణికొండ మహిళా విభాగం విజ్ఞప్తి.

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతము ఖాళీ అవుతున్నటువంటి గవర్నర్ కోటాలో ఉన్నటువంటి ఎమ్మెల్సీ స్థానంలో ఆర్యవైశ్య మహిళలకు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ ముఖ్యమంత్రి కి మణికొండ AVOPA ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శి కోశాధికారి స్నేహ మహాలక్ష్మి దేవి ప్రియ విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగి మూడు పర్యాయాలు MLA ఎలక్షన్స్ MP ఎలక్షన్స్ జరిగాయి మరియు మధ్యలో కొన్ని MLC స్థానాలకు కూడా ఎలక్షన్స్ జరిగాయి, కాంగ్రెస్ పార్టీకి అవకాశం వచ్చి సుమారుగా 400 మంది ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ పార్టీ బి ఫారం టికెట్లు ఇచ్చింది , అందులో ఒక్కరి అంటే ఒక్కరి కూడా ఆర్యవైశ్యులకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వలేదు.

తెలంగాణ రాష్ట్రంలో 6 నుంచి 8 శాతం ఉన్న ఆర్యవైశ్యులలో కాంగ్రెస్ పార్టీ ఒక్క నాయకత్వాన్ని కూడా గుర్తించలేదు, ఎమ్మెల్యే ఎంపీ పదవులకు అవకాశం వచ్చినప్పుడు ఒక్కసారి కూడా ఒక్క అంటే ఒక్క ఆర్యవైశ్యునికి మీరు టికెట్ ఇవ్వలేదు, కనీసం ఇప్పుడైనా మీ చేతుల అవకాశం ఉంది, కనీసం ఇప్పుడైనా మా ఆర్యవైశ్య లోకానికి ముఖ్యంగా ఆర్యవైశ్య మహిళలకు గవర్నర్ కూటలో ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని మేము బలంగా మీ మీద ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నాము.



గతంలో ఆర్యవైశ్య పితామహుడు రోశయ్య ని ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి అత్యున్నత పదవులను అధిరోహించిన ఆయన ప్రస్థానం ఆర్యవైశ్యులకు స్ఫూర్తిదాయకం. కాంగ్రెస్ పార్టీ అందించిన ప్రోత్సాహం, అవకాశాలు ఆయన ఎదుగుదలకు దోహదపడ్డాయి. మా ఆర్యవైశ్య మద్దతు కూడా మీ పార్టీకి అందించారు.

ఈ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా, ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాన్ని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి కేటాయించాలని మేము కోరుతున్నాము.

ఆర్యవైశ్యుల సమస్యలను చట్టసభల్లో వినిపించడానికి మాకు ఒక్క నాయకత్వం కూడా లేదు ఇది చాలా సిగ్గుచేటు మా లోకానికి.

కావున, ముఖ్యమంత్రి మీరు మా విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి, గవర్నర్ కోటాలో ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లవలసిందిగా హృదయపూర్వకంగా కోరుతున్నాము.

ఆర్యవైశ్యుల ఆకాంక్షలకు తగిన గుర్తింపు లభించేలా మీరు సహకరిస్తారని ఆశిస్తున్నాము.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలపై ర్యాలీ



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 ఏటూరు నాగారం తెలంగాణ రాష్ట్రం అంతట నిర్వహిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరావాదిక సమ్మెలో భాగంగా 23 రోజున ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు తెలంగాణ రాష్ట్ర మంతట 17వేల మంది జాతీయ ఆరోగ్య మిషన్ లో విధులు నిర్వహిస్తున్నారు ఉద్యోగులందరూ అక్టోబర్ 13 నుంచి ఇప్పటివరకు నిరవధిక సమ్మె సమస్యల పరిష్కారానికై పోరాడుతూ ర్యాలీలు సమ్మెలు నిర్వహిస్తున్నారు అదేవిధంగా ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రిలో ఎన్ హెచ్ ఎం లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు వీరి డిమాండ్లు

1 ఉద్యోగ భద్రత సమాన పనికి సమాన వేతనం. 2 మహిళలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఏర్పాటు 3 60 జీవోను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు

4 ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు

5 అన్ని క్యాడర్ల ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

లేని పక్షంలో పెద్ద ఎత్తున ఎన్హెచ్ఎంలో పనిచేస్తున్న 17వేల మంది ఉద్యోగులు రోడ్డుపై రావాల్సిన పరిస్థితి కనబడుతుందని వెంటనే ప్రభుత్వం మా డిమాండ్లను పరిష్కరించి మా సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో గంగా భవాని సౌజన్య ప్రవంతి మౌనిక

సంధ్య సత్యవతి కౌసల్య నిర్మల సుమలత బతుకమ్మ

యశోద మురళి దేవరాజ్ వెంకట్ రాజేష్ కృష్ణ గంగాధర్

కామారెడ్డి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం..

14 మంది మెడికోలపై సస్పెన్షన్

కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. జూనియర్ విద్యార్థులను వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 14 మంది సీనియర్లపై కళాశాల యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంది. ఆరోపణల తీవ్రత ఆధారంగా నలుగురు విద్యార్థులను ఆరు నెలలు, మరో పది మందిని నాలుగు నెలల పాటు సస్పెండ్ చేసింది. ఒకేసారి 14 మందిపై చర్యలు తీసుకోవడం వైద్య కళాశాల వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ఎన్ఎంసీకి ఫిర్యాదుతో వెలుగులోకి..: కళాశాలలో కొందరు సీనియర్లు తమను వేధిస్తున్నారంటూ జూనియర్ విద్యార్థులు వారం రోజుల క్రితం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) యాంటీ ర్యాగింగ్ సెల్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన ఎన్ఎంసీ అధికారులు స్థానిక పోలీసులతోపాటు కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించారు. దీంతో

కళాశాల యాజమాన్యం అంతర్గత విచారణ చేపట్టింది. విచారణలో ర్యాగింగ్ జరిగినట్లు నిర్ధారణ కావడంతోపాటు, ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలు కూడా లభించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై మంగళవారం కళాశాల ఉన్నతాధికారులు, ప్రిన్సిపాల్ వాల్యా, వివిధ విభాగాల అధిపతులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విచారణలో వెలుగుచూసిన అంశాలను పరిశీలించి 14 మంది విద్యార్థులపై సస్పెన్షన్ విధించాలని నిర్ణయించారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురికి ఆరు నెలలు, మరో పది మందికి నాలుగు నెలల సస్పెన్షన్ విధించారు. సస్పెండ్ అయిన వారిలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా ఉన్నారు. జూనియర్ల ఫిర్యాదుతోనే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ వాల్యా తెలిపారు. ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారమే చర్యలు తీసుకున్నామని, తదుపరి విచారణ కొనసాగుతోందని వివరించారు. కళాశాల ప్రాంగణంలోనైనా, హాస్టల్‌లోనైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గ్రామ పంచాయతీల్లో ఈవీ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 04 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్, బ్యాటరీ స్వాపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతీసుకుంది.దీనికోసం పంచాయతీరాజ్ శాఖ, (సీఈఎస్ఎల్) సంస్థ ఒప్పందం చేసుకున్నాయి. న్యూఢిల్లీలో జరిగిన ఈ ఒప్పందం ద్వారా, పంచాయతీల ఖాళీ భూముల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు, దీనివల్ల పంచాయతీలకు అదనపు ఆదాయంలభించడంతో పాటు, పెట్రోల్, డీజిల్పై ఆధారపడటం తగ్గుతుంది. ప్రస్తుతం దేశంలో 29,151 పబ్లిక్ ఈవీ చార్జింగ్ కేంద్రాలు ఉండగా, ఈసదుపాయాన్ని గ్రామీణ ప్రాంతాలకువిస్తరించడమేలక్ష్యమని కేంద్రం తెలిపింది

ఉపాధి కల్పన.. జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని నిరంతరం పరిశీలించాలి

పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 ములుగుబుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి పనులు, కూలీల హాజరు, జాబ్‌కార్డుల జారీ, మేట్ల శిక్షణ, జలసిరి పనులు, గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు ఈ సమావేశానికి హాజరయ్యారు.





ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నవంబర్ 3 నాటి నివేదిక ప్రకారం రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీల కుగాను 12,280 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా 5,02,697 మంది కూలీలు పనులకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంకా పనులు ప్రారంభించని పంచాయతీలపై దృష్టి సారించి, ఉపాధి కోరే కూలీలకు పనులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జాబ్‌కార్డుల జారీకి సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించాలని, కూలీల హాజరు, పనిదినాల నమోదును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

జలసిరి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 55,133 పనులు ప్రారంభించి, 14,121 పనులు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. వ్యవసాయ కుంటలు, ఊటకుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల పూర్తిపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. పశుగ్రాస సాగు, పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా సిద్ధం చేసేలా పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు.

ములుగు జిల్లాలో 171 గ్రామ పంచాయతీలకుగాను 162 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించామని, నవంబర్ 3న 7,465 మంది కూలీలు పనులకు హాజరయ్యారని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు కమిషనర్‌కు వివరించారు. పనులు ప్రారంభమైన పంచాయతీల్లో కూలీల సగటు హాజరు 46గా నమోదై, రాష్ట్ర సగటు 41 కంటే మెరుగ్గా ఉండటంపై కమిషనర్ జిల్లా అధికారులను అభినందించారు. జిల్లాలో ప్రారంభించిన వ్యవసాయ కుంటల పనులతోపాటు నవంబర్ 19 నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాల్సిన 254 నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఏఎల్ఎం హరీష్ మృతి

జీడిగడ్డ తండాలో విషాదం.. విద్యుత్ స్తంభం మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం

జహీరాబాద్, నవంబరు 4 ప్రజా బలం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం జీడిగడ్డ తండాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ స్తంభం వైర్లకు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కావడంతో షాక్‌కు గురై ఏఎల్ఎం హరీష్ మృతి చెందారు. బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. గ్రామంలో విద్యుత్ స్తంభం వైర్ల మరమ్మతు పనులు చేపడుతున్న సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా రావడంతో హరీష్‌కు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ కార్యాలయ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని విచారం వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో జీడిగడ్డ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.



డాక్టర్ పూజ ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న మేనమామ సునీల్



వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం సునీల్ డాక్టర్ పూజా ఎంగేజ్మెంట్ లో పాల్గొని నూతనంగా జతపరచబడబోతున్న కాబోయే వధూవరులను ఆశీర్వదించి త్వరలో రెండు కుటుంబాలు ఐక్యపరచబడి రెండు హృదయాలు జత చేయబడి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని సునీల్ తెలిపారు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపడుతున్నాం.

ఉద్యోగాలు ఇప్పిస్తామనే దళారుల మాటలు నమ్మొద్దు.

నాలుగు రోజులపాటు జరగనున్న ఇంటర్వ్యూలు.

ఇంటర్వ్యూలను నిర్వహించిన కమిటీ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 కలెక్టరేట్ బుధవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆర్ డి ఓ కృష్ణవేణి, ఎస్ డి సి ప్రతాప్, డి ఎం హెచ్ ఓ గోపాలరావు, డి డబ్ల్యు ఓ ప్రేమలత ఫైవ్ మెన్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థుల అర్హతలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో దళారుల ప్రమేయానికి తావులేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించారు.జిల్లాలోని తాడ్వాయి, వెంకటాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 31 అంగన్‌వాడీ టీచర్, 104 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నవంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలిరోజు తాడ్వాయి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టుల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నవంబర్ 5న వెంకటాపురం ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు, 6న తాడ్వాయి ప్రాజెక్టు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు, 7న వెంకటాపురం ప్రాజెక్టు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.



మృతుడి కుటుంబాన్ని పరామర్శించి పెద్దకర్మ కు బియ్యం కూరగాయలు

అందజేసిన కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ అధ్యక్షులు (సర్పంచ్) జాడి రాంబాబు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్. 04కన్నాయిగూడెం మంత్రి సీతక్క గారి అదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు అశోక్ సూచనల మేరకు కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు జాడి రాంబాబు బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో కోత్తురు గ్రామానికి చెందిన యూత్ కాంగ్రేస్ నాయకులు కుమ్మరి చంద్రబాబు, రంగారావు తండ్రి(కుమ్మరి గట్టయ్య) ఇటీవల గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు ఈరోజు వారి పెద్ద కర్మ ఉండగా కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ నాయకులు మరియు గ్రామ కాంగ్రేస్ నాయకులు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి పెద్దకర్మ కు 25 కేజీల బియ్యం కూరగాయలు అందజేసి వారికీ కుటుంబానికి దైర్యం చెప్పి ఎటువంటి కష్టాలలోనైనా కాంగ్రేస్ పార్టీ అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడేం మండల కిసాన్ కాంగ్రేస్ అధ్యక్షులు తాటి రాజబాబు, మరియు వార్డు సభ్యులు, గ్రామ యూత్ నాయకులు, గ్రామ కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



మంగపేట నూతన ఎస్‌హెచ్‌ఓ మధుకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 మంగపేట.బుధవారం మంగపేట పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన స్టేషన్ హౌస్ ఆఫీసర్ మధుకర్ గారిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా చెట్టుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మంగపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నూతన బాధ్యతలు చేపట్టిన మధుకర్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.మండలంలోని అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సేవలందిస్తూ,ప్రజలకు అందుబాటులో ఉంటూ,మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలని కోరారు.ప్రజలు,పోలీస్ శాఖ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింతా పున్నారావు,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,జిల్లా లీగల్ సెల్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

కుడుముల శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన బడే నాగజ్యోతి. మాజీ జెడ్పీ చైర్మన్

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 మంగపేట మంగపేట మండల బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుడుముల లక్ష్మీనారాయణ తమ్ముడు కుడుముల శ్రీనివాస్ మృతి చెందడం బాధాకరం.

విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతిబుధవారం మొట్లగూడెం (మల్లూరు)లోని వారి స్వగృహానికి వెళ్లి శ్రీనివాస్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.



ఈ కార్యక్రమంలో, జిల్లా నాయకులు, జగదీష్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, ఎస్ టి సెల్ మాజీ మండల అధ్యక్షులు తోలెం నర్సింహా రావు, నర్సింహాసాగర్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, నర్సాపూర్ బోర్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు రావుల రమణ, మైనార్టీ సీనియర్ నాయకులు భూట్టో, ఎస్ సెల్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి కేక్కం జగదీష్, పార్టీ నాయకులు, కోరం నర్సింహులు,యూత్ నాయకులు గౌని రమేష్, నాగ, బొడ మహేష్, సాధనపల్లి రవి, అరవింద్, సోషల్ మీడియా వారియర్స్ బీసా సాంబయ్య,గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు

రామప్ప దేవాలయ రామలింగేశ్వర స్వామి గుడి లెక్కింపు

లెక్కింపులో దేవాలయ ఆదాయం ఎనిమిది లక్షల 73,570 రూపాయలు



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 పాలంపేటములుగు జిల్లాలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం లో కొలువై ఉన్నశ్రీ రామలింగేశ్వర స్వామి (రామప్ప)దేవస్థానం గ్రా, పాలంపేట మం, వెంకటాపూర్ జి, ములుగు యొక్క హుండీ లను బుధవారం రోజున ఉదయం 11:00 లకు సదరు దేవస్థానంమంటపం నందు శ్రీ డి. అనిల్ కుమార్ పరిశీలకులు పరకాల విభాగం గారి సమక్షంలో విప్పి లెక్కించగా నోట్లురూ 7,85,720:00రూ లు నాణెములు 87,850 :00రూ లు మొత్తం. 8,73,570:00 వచ్చినవి. ఇట్టి కార్యక్రమం లో ఇమ్మడి భాస్కర్ కార్యనిర్వాహణాధికారి,కె. హరీష్ శర్మ,ముఖ్య అర్చక, ఉమశంకర్ అర్చక మరియుశ్రీ భవానిప్రసాద్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటాపూర్ పాలంపేట గ్రామ సర్పంచ్ శ్రీ చల్ల కొండ రాజు రమేష్ RI, పోలీస్ సిబ్బంది, శ్రీరాజరాజేశ్వర సేవా సమితిహన్మకొండ సభ్యులు,ఆలయ సిబ్బందిమరియు పురా వాస్తు శాఖ సిబ్బంది టూరిజం గైడ్ లు పాల్గొన్నారు.

ఇమ్మడి భాస్కర్ కార్యనిర్వాహణాధికారి

జగిత్యాల చిన్నారి ఘటనలో ట్విస్ట్..

హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని కలెక్టర్ పిటిషన్

జగిత్యాల 'అమ్మా.. నన్ను తీసుకెళ్లు.. భయమేస్తోంది' అంటూ శిశు సంక్షేమ కేంద్రంలో చిన్నారి రోదించిన వీడియోతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన జగిత్యాల బాలుడి దత్తత వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు చిన్నారిని పెంపుదు తల్లిదండ్రులకు అప్పగించినప్పటికీ వివాదం సద్దుమణగలేదు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించాలని ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత ఉత్తర్వులపై స్టే విధించి, చిన్నారిని తిరిగి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని జంబిగద్దెకు చెందిన సరిత, శ్రీనివాస్‌గౌడ్ దంపతులకు సంతానం లేకపోవడంతో మూడేళ్ల క్రితం కోర్టుల్లకు చెందిన ఓ దంపతుల నుంచి నెల రోజుల వయసున్న శిశువును తీసుకుని పెంచుకుంటున్నారు. తల్లి మరణించిన ఆ చిన్నారిని తమ బిడ్డగానే భావిస్తూ అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. అయితే ఆస్తి తగాదాల నేపథ్యంలో శ్రీనివాస్‌గౌడ్ బంధువులు బాలుడి దత్తత చట్టబద్ధంగా జరగలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సెప్టెంబర్ 16న చిన్నారిని దంపతుల నుంచి తీసుకుని కరీంనగర్ శిశుగృహకు తరలించారు. దీంతో చిన్నారిని తమకు అప్పగించాలంటూ సరిత, శ్రీనివాస్ దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం అక్టోబర్ 16న బాలుడిని పెంపుదు తల్లిదండ్రులకు అప్పగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పగింతలో జాప్యం జరగడంతో దంపతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. శిశు గృహలో చిన్నారిని కలిసేందుకు వెళ్లిన సమయంలో 'డాడీ.. ఇంటికి తీసుకెళ్లు.. అమ్మా.. నన్ను తీసుకెళ్లు.. భయమేస్తోంది' అంటూ బాలుడు రోదించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి చిన్నారిని దంపతులకు అప్పగించారు. దీంతో రెండు నెలలుగా బిడ్డకు దూరంగా ఉన్న ఆ దంపతుల ఇంట్లో ఆనందం నెలకొంది. హైకోర్టు ఉత్తర్వులపై కలెక్టర్ అభ్యంతరం: చిన్నారిని అప్పగించిన తర్వాత తాజాగా కలెక్టర్ సత్యప్రసాద్ హైకోర్టును ఆశ్రయించడం ఈ వ్యవహారంలో కొత్త మలుపుగా మారింది. సీడబ్ల్యూసీ నిబంధనలు, అధికారులు సమర్పించిన ఆధారాలను పూర్తిగా పరిశీలించకుండానే బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని కలెక్టర్ తన పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం.

తాల్లగూడెం కోడి పుంజుల అంగడిపై పోలీసుల ఆకస్మికంగా మెరుపు దాడి.

పోలీసుల అదుపులో 200 మంది పందెం రాయుళ్ళు...!

వాట్సప్ ప్రత్యేక గ్రూపు ద్వారా కోడి పందాల నిర్వహణ

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04 వాజేడతెలంగాణ చత్తీస్గడ్ సరిహద్దు.ప్రాంతాల్లో గత కొంతకాలంగా యదేచ్ఛగా సాగుతున్న కోడిపందాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కోడి పందాల కోసం ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసుకొని క్షణాల్లో సమాచారం చేరవేసుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

దీంతో తెలంగాణలోని పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున కోడిపందెంలో పాల్గొనేందుకు పందెం రాయలు వారానికి రెండు రోజులపాటు ఈ సరిహద్దు ప్రాంతానికి చేరుకొని కోడిపందాలలో పాల్గొంటారు. ప్రతివారం సుమారు 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు కోడిపందాలు జరుగుతున్నట్లు సమాచారం జాతరను తలపించేలా ఏర్పాట్లు కోడి పందాలు భారీ ఎత్తున భారీ ప్రదేశాలలో ఏర్పాట్లు చేయడం మరో విశేషం.

కాగా మంగళవారం చతీస్గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భూపాలపట్నం తాలూకాలోని తాల్లగూడెం గ్రామంలో కోడి పుంజుల పందెం రాయుళ్ల అడ్డాలపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి 200 నుంచి 300 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కొందరు గుట్టుచప్పుడు కాకుండా కొన్ని రోజుల నుంచి పందెం రాయుళ్ళు రెచ్చిపోవడంతో బీజాపూర్ నూతన ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్త ఆధ్వర్యంలో ఏకకాలంలో దాడులు నిర్వహించినట్లు సమాచారం.

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మిపురం దేవాదుల, తుపాకులగూడెం, గూర్రేవుల, రాజన్నపేట, ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, ఏటూర్, సింగారం గ్రామాలకి చెందిన పలువురు ఉన్నట్లు సమాచారం. మండలం నుంచి నిత్యం సమ్మక్క బ్యారేజ్ గుండా లేదా నాటు పడవల ద్వారా గోదావరి నదిని దాటి పందెం కాస్తున్నట్లు సమాచారం.

చత్తీస్గడ్ రాష్ట్రంలో పట్టుబడిన వారిలో కన్నాయిగూడెం మండలానికి చెందిన పలువురు ఉండటం విశేషం. వాజేడు, నూగూరు వెంకటాపురం మండలాల నుంచి పెద్ద ఎత్తున ఉన్నట్లు సమాచారం. కాగా పందెం రాయులను పోలీసులు అదుపులోకి వారి సమాచారం తెలియక కుటుంబ సభ్యులు తమ వారి కోసం ఫోన్లు చేయడంతో స్విచ్చాఫ్ రావడంతో ఆందోళనలో ఉన్నట్లు తెలిసింది.

పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో భద్రాచలం, మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్, బెల్లంపల్లి, చెన్నూరు జిల్లాల పందెం రాయుళ్ళు ఉన్నట్లు సమాచారం. మహారాష్ట్రలోని అంకీస, ఆసరల్లి, టేకడ పాతగూడెం గ్రామాలకి చెందిన వాళ్ళు ఉన్నట్లు సమాచారం.

నెమలి నగర్ ప్రజా సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలి









భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపూర్ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, అందె లక్ష్మణ్ రావు, యాలాల కిరణ్, సుమనళిని, షేక్ ఆరిఫ్, షకీలా రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, బాబు రావు మరియు స్థానికులు అశోక్, శ్రీనివాసు, మల్లేష్, నగేష్ లతో పాటు బుధవారం రోజున నెమలినగర్ పరిధిలో గత దశాబ్దాలుగా నివసిస్తున్న దరిదాపు 400 కుటుంబాలు ఉన్న రాజీవ్ గృహ కల్ప, 60 గజాల స్థలం ప్రాంతంలో ఉన్న 400 కుటుంబాల నిత్యావసర విద్యా వైద్యం సదుపాయాలు ఎలా ఉన్నాయో గమనించడానికి ప్రభుత్వ పాఠశాల, ఆట స్థలాలు, బస్తీ దవాఖానా, అంగన్వాడీ తదితర ప్రాంతాల్లోని సమస్యలు తెలుసు కునేందుకు పర్యటించడం జరిగినథి.

ఆస్తి పన్నుల మదింపు విషయమై గత ఆరు సంవత్సరాలకు పైగా జరపక పోవడం, ఇంటి నంబర్లు కేటాయించక పోవడం వల్ల మున్సిపల్ కార్పొరేషన్‌కు భారీగా ఆదాయ నష్టం జరుగుతోంది. వెంటనే ఆస్తుల మదింపు చేపట్టి, ఇంటి నంబర్లు కేటాయించి పన్నుల వసూలును ప్రారంభించాలి.

ఓ.ఆర్.ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి నెమలినగర్ రహదారి బిల్డర్ల నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలను నడపడం వల్ల తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల నిత్యం ప్రయాణించే ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే రహదారిని పునరుద్ధరించడంతో పాటు, జరిగిన నష్టానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి.

బస్తీ దవాఖానా మరియు అంగన్‌వాడీ కేంద్రంలకు నీటి సరఫరా కనెక్షన్లు లేవు. బస్తీ దవాఖానాను రాత్రి వేళల్లో దుర్వినియోగం కాకుండా రక్షణ కోసం సెక్యూరిటీ గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం 52 రకాల నిర్ధారణ పరీక్షలకు బదులుగా కేవలం 23 పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఎం.బీ.బీ.ఎస్ వైద్యుడు లేకపోవడం కూడా ఇందుకు కారణంగా తెలుస్తోంది. వెంటనే వైద్యుడిని నియమించి, అన్ని నిర్దేశిత పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలి.

90 మంది విద్యార్థులు తాత్కాలిక రేకుల షెడ్లలో విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు సురక్షితమైన, మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు శాశ్వత పక్కా పాఠశాల భవనాన్ని నిర్మించాలి.

అర్బన్ డెవలప్మెంట్ శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు పిల్లల ఆటస్థలం నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి నిర్లక్ష్యానికి గురవుతోందని

తీసుకెళ్లినప్పటికీ ఉలుకూపలుకూ లేకుండా పోయిందని, వెంటనే వ్యర్థాలను తొలగించి, ఆటస్థలాన్ని పునరుద్ధరించి, నిరంతర నిర్వహణ చేపట్టాలి.

ఇందిరమ్మ ఇళ్లు సరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు మరియు నిర్వహణ చర్యలు చేపట్టాలి.

రేషన్ షాపు లేకపోవడంతో ప్రజలు నిత్యావసర సరుకుల కోసం నార్సింగి లేదా పుప్పాలగూడకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానికంగా రేషన్ షాపును ఏర్పాటు చేయాలి.

పై సమస్యలన్నింటినీ సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి. ప్రజలకు అందించాల్సిన కనీస మౌలిక సదుపాయాలు, వైద్యం, విద్య మరియు సంక్షేమ సేవల విషయంలో నిర్లక్ష్యానికి తావుండ కూడదని బి ఆర్ ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అంగరంగ వైభవం గా బాలాపూర్ సిద్ధార్థ కాలేజీలో ఫ్రెషర్స్ వేడుకలు

- మిస్ ఫ్రెషర్ టైటిల్ ను కైవసం చేసుకున్న హన్సిక (బి సీ ఏ కోర్స్)



హైదరాబాద్ బాలాపూర్ బ్రాండ్ సిద్ధార్థ కాలేజీలో వివిధ బ్రాంచీల విద్యార్థులతో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.సిద్ధార్థ కాలేజీ అంటే చదువు మాత్రమే కాదు... ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్ అనే నినాదంతో నిర్వహించిన ఈ వేడుకలో విద్యార్థులు ఎంతో సందడిగా గడిపారు.

డాన్స్ పెర్ఫార్మెన్స్‌లతో స్టేజ్ దద్దరిల్లింది. ర్యాంప్ వాక్‌లో విద్యార్థులు తమ అందాలను ప్రదర్శించారు. సీనియర్లు, జూనియర్లు కలిసి ఎంజాయ్ చేశారు.మిస్ ఫ్రెషర్స్ టైటిల్ ను బి సీ ఏ కోర్సుకు చెందిన హన్సిక మిస్ ఫ్రెషర్స్ గా విజేతగా నిలిచింది. కాలేజీ యాజమాన్యం విద్యార్థుల ప్రతిభను అభినందించింది.

హైదరాబాద్ నగరంలోని దిల్సుఖ్ నగర్ ప్రాంతంలోని ప్రముఖ సిద్ధార్థ డిగ్రీ కాలేజీ లో “గ్రాడ్యుయేషన్ డే ఁ బ్లోసమ్స్ 2026” సాంస్కృతిక వేడుకలు మంగళవారం రోజున ఎం .ఈ . రెడ్డి గార్డెన్స్ లో ఎంతో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా .ప్రగతి గుర్రం కన్సల్టెంట్ ఇంటర్వెంషనల్ కార్డిలోజిస్ట్ ఏ ఐ జి హాస్పిటల్స్ ఎడ్వైస్ –చైర్మన్ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ హాజరయ్యారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, హార్ట్ ఎటాక్ వచ్చిన అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ ఎలా చేయాలో వివరించారు.చదువులో ఉత్తీర్ణత సాధించిన 2023-2026 డిగ్రీ విద్యార్థులకు మరియు 2024-2026 ఎం బి ఏ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరించారు.సిద్ధార్థ డిగ్రీ కాలేజీ చదువులతో పాటు సమాజానికి చేస్తున్న సేవలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సిద్ధార్థ గ్రూప్ అఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఫౌండర్ ఁ చైర్మన్ డా . జి . నాగయ్య పాల్గొని, తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన 800కు పైగా విద్యార్థులను అభినందించారు.సిద్ధార్థ డిగ్రీ కాలేజీ ఫర్ ఉమెన్ ప్రిన్సిపాల్ శ్రీమతి గోవర్ధని , సిద్ధార్థ గ్రూప్ అఫ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీ వంశీ కృష్ణ , సిద్ధార్థ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఁ ప్లేసెమెంట్ ఆఫీసర్ శ్రీమతి త్రివేణి కాంచన, సిద్ధార్థ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమతి సల్మా సుల్తానా, సిద్ధార్థ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమతి కవిత,మోహన్ రావు, రామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జాతీయ వుషూ ఛాంపియన్‌షిప్‌లో జహీరాబాద్ విద్యార్థుల సత్తా!

తెలంగాణ జట్టు తరపున జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన శ్లోక్ సాగర్, ఉమా మహేశ్వరి

జహీరాబాద్, నవంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో జహీరాబాద్ పట్టణానికి చెందిన విద్యార్థులు తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించిన 25వ జూనియర్ జాతీయ వుషూ ఛాంపియన్‌షిప్--2026లో జహీరాబాద్‌కు చెందిన వజ్ర వీర మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు శ్లోక్ సాగర్, ఉమా మహేశ్వరి తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.ఈ పోటీల్లో శ్లోక్ సాగర్ 6.98 పాయింట్లు, ఉమా మహేశ్వరి 6.86 పాయింట్లు సాధించి ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయి వేదికపై తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం ద్వారా జహీరాబాద్ పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. చిన్న వయసులోనే క్రీడలపై ఆసక్తి పెంచుకుని, నిరంతర సాధనతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వజ్ర వీర మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్లు శంకర్ సాగర్, సిద్ధా రెడ్డి మరియు కోచ్ సంధ్య చౌహాన్ క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో సాధన చేసి ఉన్నత స్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని, జహీరాబాద్ పట్టణంతో పాటు సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల వారి తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు, శిక్షకులు హర్షం వ్యక్తం చేశారు.



తుపాను వేళ రైతులకు ఎమ్మెల్యే భరోసా!

సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, దెబ్బతిన్న పంటల క్షేత్రస్థాయి పరిశీలన

వేంసూరు మండలంలోని 59 చెరువులకు నీరు చేరే అవకాశం.. పంట నష్టంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు.









సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 04: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితుల నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, రైతులకు అండగా నిలవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ పొలాలను ఆమె క్షేత్రస్థాయిలో సందర్శించి పరిస్థితులను సమీక్షించారు.

సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు అలుగు పారడంతో తూములు ఎత్తి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. దీంతో వేంసూరు మండల పరిధిలోని సుమారు 59 సాగునీటి చెరువులకు నీరు చేరే అవకాశం ఏర్పడింది. అలాగే పెనుబల్లి మండలంలోని లంకసాగర్ ప్రాజెక్టు సైతం అలుగు పారడంతో సాగర్ కాలువలకు నీటిని విడుదల చేశారు.

బేతుపల్లి ప్రాజెక్టు నుంచి విడుదలైన నీరు చేరుతున్న వేంసూరు మండల కేంద్రంలోని పచ్చగన్నేరు చెరువును ఎమ్మెల్యే ప్రత్యేకంగా పరిశీలించారు. నీటి ప్రవాహం, చెరువు పరిస్థితులు, సాగునీటి సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మరోవైపు తుపాను ప్రభావంతో పలు గ్రామాల్లో నేలకొరిగిన వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యంతో పంటలు దెబ్బతినడం పట్ల ఆవేదన వ్యక్తం చేసిన ఆమె.. రైతులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి, నివేదికలను త్వరితగతిన రూపొందించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. ప్రాజెక్టులు, చెరువులు, కాలువల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటి ప్రవాహాలు పెరిగే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు.

అధికార యంత్రాంగం నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ వర్షాలు, వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు.

కట్టలేరు వాగులో వరద ఉధృతి..

20 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినగడప, తోటమూల గ్రామాల మధ్య కట్టలేరు వాగులో వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. దీంతో శివారు ప్రాంతాల్లోని 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రేపు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం 2 కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు దాదాపు 30 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది.



Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com